J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 6 12.07.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

▶ ఆంధ్ర కంపెనీలో 'వినయ విధేయ వీరుల'...

# తీగ లాగుతున్నారు!

- 'అయ్యా ఎస్'.. అంటూ సల(స్వా)హాదారుల చేతిలో కీలుబొమ్మలుగా మారిన అఖిల భారత సర్వీసు అధికారులు
- సమాచార శాఖని 'దురాచార శాఖ'గా మార్చిన విజయకుమార్
- 'అధర్మో రక్షతి.. భక్షితః'గా.. టీటీడీలో చక్రం తిప్పిన (అ)ధర్మారెడ్డి

తమ అయిదేళ్ళ కార్పొరేట్ తరహా పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గత ప్రభుత్వ పెద్దలు తమ సొంత కంపెనీగా మార్చేసుకున్నారు. అఖిల భారత సర్వీసు అధికారులు సైతం తమ సంస్థ జనరల్ మేనేజర్లన్నట్లుగా భావించి వారిచేత పనులు చేయించుకున్నారు.

"అయ్యా ఎస్..." అంటూ సల(స్వా)హాదారుల చేతులలో అత్యున్నత స్థాయి అధికారులు కూడా కీలుబొమ్మలయ్యారు. మీరు రిటైరయ్యే వరకూ ఇక మేమే మీకు బాసులమన్నట్లుగా వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన బిల్డప్‌ని కొంతమంది అధికారులు గుడ్డిగా నమ్మారు. వారి మాయలో పడిపోయి వారికి వినయ విధేయ వీరులుగా పనిచేశారు. ఎక్కడ పెట్టమంటే అక్కడ కళ్ళు మూసుకుని సంతకాలు పెట్టారు. తమ సంతకానికి ఉన్న పవర్‌ని సల(స్వా)హాదారుల స్వార్ధానికి తాకట్టు పెట్టారు. ఆ అధికారులందరూ ఇప్పుడు కష్టాలని ఎదుర్కొంటున్నారు.

10 లో



## టీటీడీ ఛైర్మెన్‌గా 'టీవీ5' నాయుడు?

టీటీడీ ఛైర్మెన్ ఎవరు...? అన్న ఊహాగానాలకి త్వరలోనే తెర పడబోతున్నట్లు అమరావతి వర్గాల ద్వారా తెలుస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి కొత్త ఛైర్మెన్‌గా టీవీ5 అధినేత బొల్లినేని రాజగోపాల్‌నాయుడు (బి.ఆర్.నాయుడు)ని చంద్ర బాబు నియమించబోతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.

3 లో

## 'ఆమే'.. కుటుంబానికి ఆ'భరణం'

12 లో

సుప్రీం కోర్టు బాసట.. మహిళలకి ఊరట

N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Affiliated to JNTUA, Ananthapuramu
Vidyanagar, Tirupati Dt. Phone : 8985382247, www.nbkrist.org

Campus Placements During 2023-2024

| | | | |
|---|---|---|---|
| tcs Prime 15* 9 LAKH P.A. | enzen 1 9 LAKH P.A. | SAP 3 8 LAKH P.A. | tcs digital 86* 7 LAKH P.A. |
| accenture 6 6.6 LAKH P.A. | Snovasys 3 5.5 LAKH P.A. | IntelliPaat 55 5 LAKH P.A. | HYUNDAI 8 5 LAKH P.A. |
| accenture 75 4.6 LAKH P.A. | IQ India 4 4.5 LAKH P.A. | AMARA RAJA 5 4 LAKH P.A. | MAGNA 5 4 LAKH P.A. |

* INTERVIEWS IN PROGRESS

EAPCET CODE NBKR

Courses Offered: B.Tech.
- CSE
- AI & DS
- ECE
- EEE
- CIVIL
- MECHANICAL

COLLEGE BUS FACILITY FROM
Buchireddy Palem | Nellore | Gudur | Naidupeta | Sullurupeta | Tada | Venkatagiri
Muthukuru | Mallam | Podalakuru | Rapuru, Sydapuram & Srikalahasti

FOR ADMISSIONS CONTACT CELL: 94415 72755 / 9440243010


NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

# జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించిన మంత్రులు



నెల్లూరుజిల్లా అభివృద్ధిపై జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు దృష్టి సారించారు. జిల్లా అధికారులతో పలుసార్లు సమావేశమై అభివృద్ధి పనులను సమీక్షిస్తున్నారు. ఇటీవల నెల్లూరులోని ఆనం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అభివృద్ధిపనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతం చేస్తామన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. నెల్లూరు నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరు, కడప జిల్లాల్లోని లేఅవుట్లలో అనేక అక్రమాలు జరిగాయని, వీటిపై విచారణకు ఆదేశించామని, ఇక నుంచి లేఅవుట్లకు ఒక వారంలోనే అనుమతులు ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. నెల్లూరులో నీటి సమస్యపై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు.

## 'స్టేట్‌లీడర్' సర్వేపల్లి రామ్మూర్తి.. అస్తమయం



నెల్లూరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు 'స్టేట్‌లీడర్' పత్రిక సంపాదకుడు సర్వేపల్లి రామ్మూర్తి (78) కన్నుమూశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ, ఈనెల 8న ఆయన నెల్లూరులో తుదిశ్వాస విడిచారు. మండల కేంద్రమైన సర్వేపల్లిలో జన్మించిన రామ్మూర్తి, తొలినుంచి జర్నలిజం పట్ల, సాహిత్యం పట్ల ఆసక్తితో ఉండేవారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆయన పాత్రికేయ రంగంలో ఉన్నారు. తొలుత, 'అపరాజిత' పేరుతో పత్రిక నడిపారు. ఆ తర్వాత స్టేట్‌లీడర్ పత్రికను స్థాపించి ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఆ పత్రికను నడిపేవారు. చిన్నపత్రికలను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, వాటికి తగు ప్రాధాన్యత ఇవ్వాలని పోరాడేవారు. సర్వేపల్లి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటుచేసి ఉత్తమ ఉపాధ్యాయులను, సాహితీవేత్తలను సన్మానించేవారు. పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. 'సామ్నా' జిల్లా అధ్యక్షునిగా కూడా ఉండేవారు. నెల్లూరు టౌన్‌హాల్లో జరిగే సాహితీ కార్యక్రమాలకు ఠంచనుగా రావడం ఆయనకు అలవాటు. ఆయనకు భార్య, సోదరులున్నా కొద్దికాలం క్రితం వారు ఒకరొకరుగా మరణించడంతో ఆయన కుంగిపోయారు. చివరిదశలో నెల్లూరు చంద్రమౌళినగర్‌లోని ఆయన కుమార్తె ఇంట్లో ఉన్నారు. 'లాయర్' వ్యవస్థాపకులైన స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డితో ఆయనకు మంచి స్నేహం ఉండేది. ఆయన మృతికి చింతిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'!

## పెంచలకోనలో సీమరాజా



గత ఏడాదికాలంగా యూట్యూబ్‌లో రాజకీయ వ్యంగ్యాస్త్రాలు విసరడంలో అందెవేసిన చేయిగా పేరుగాంచిన సీమరాజా ఈనెల 6న నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెంచలస్వామి మహిమాన్వితమైన దేవుడని, భక్తుల పాలిట కొంగుబంగారంగా కొలువైవున్న ఆ స్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించం

### కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి




ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే, వారెంతటివారైనా సరే సహించేది లేదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈనెల 6న ఆయన కావలిలోని కలుగోళమ్మగుడి సమీపంలో వరవకాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. రోడ్డుకు రెండుపక్కలా ఉన్న కంపచెట్లను జేసీబీలతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మునిసిపల్ మంత్రి నారాయణల సహకారంతో కావలి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. గత వైకాపా పాలనలో అంతా అవినీతి జరిగిందని, ఇందిరమ్మకాలనీలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకుల సహకారంతో కావలిని అభివృద్ధిలో అగ్రగామిని చేస్తామన్నారు. రూ.10 కోట్ల వ్యయంతో కావలి రోడ్డు, డ్రైన్లు బాగుచేసి, అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ శీనానాయక్, మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, మునిసిపల్ మాజీ ఛైర్మెన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మలిశెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంటకు బస్సులు నడపాలి

### బీజేపీ నాయకుల వినతి

కావలి నుండి కొండ బిట్రగుంటకు బస్సులు నడపాలంటూ బీజేపీ నాయకుడు కె.బ్రహ్మానందం కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులుకు ఇటీవల వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్నారని, అయితే, వారు కొండకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందుల పడుతున్నారన్నారు. అందులోనూ ప్రతి శనివారం వేలసంఖ్యలో స్వామివారి భక్తులు వస్తున్నారని, వారికి సౌకర్యంగా ఉండేలా ప్రతి శనివారం కావలి నుంచి కొండ బిట్రగుంటకు ప్రత్యేక బస్సు నడపాలని కోరారు. బీజేపీ పట్టణశాఖ ప్రధానకార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్!.. ముసుగుడు చికెన్



- చేపల గుంటల్లో కుళ్ళిన కోళ్ళమాంసం వ్యర్థాలు
- డాబాలు, రెస్టారెంట్లలో అనారోగ్య పదార్థాలు
- నెల్లూరు పేరు చెడగొడుతున్న కల్తీ వ్యాపారాలు

నెల్లూరంటే ఒకప్పట్లో రుచి-శుచి కలిగిన భోజనానికి ప్రసిద్ధి. జిల్లాలోనే కాదు, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా నెల్లూరు హోటళ్లకు గొప్ప పేరుండేది. అంతేకాదు, చేపల పులుసు తినాలంటే నెల్లూరులోనే తినాలి అన్నట్లుండేది. అయితే రానురాను కొందరు ధనాశపరులు ఆ మంచిపేరును కాస్తా చెడగొడుతున్నారు. మురిగిపోయి, కుళ్ళిపోయి, పురుగులు పట్టిన కోళ్లమాంసం, వాటి వ్యర్థాలను తీసుకొచ్చి వంటకాల్లో వేసేస్తున్నారు. అత్యంత హేయమైన రీతిలో కల్తీ వ్యాపారాలు చేస్తూ కోట్లు మూటగట్టుకుంటున్నారు. వాటిని నియంత్రించేందుకు తగ్గ అధికార వ్యవస్థ లేకపోవడంతో, అదే అదనుగా అక్రమవ్యాపారులు జనం ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. ఇటీవల నెల్లూరులో ఓ ప్రముఖ రెస్టారెంట్‌ను అధికారులు ఆకస్మికంగా తనిఖీచేస్తే, అక్కడ వంటగదుల్లోని ఫ్రీజర్లలో కిలోల కొద్దీ మురిగి గబ్బుకొడుతున్న కోళ్ళ మాంసం బయటపడింది. గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నిసార్లు ఇలా అధికారులు తనిఖీలు చేస్తున్నా, ఎంత పెద్ద మొత్తాలను జరిమానాగా వేస్తున్నా జిల్లాలోని కల్తీవ్యాపారులు ఖాతరు చేయడం లేదు. అంతేకాదు,

*నెల్లూరుజిల్లాలో 'ముసుగుడు చికెన్' జోరు పెరుగుతూనే ఉంది. చేపల గుంటల్లో కుళ్ళిన కోళ్లమాంసపు వ్యర్థాలు వేసి చేపలను పెంచడం కూడా మామూలైపోయింది. కొన్ని హోటళ్లు రెస్టారెంట్లలో ఫ్రిజ్‌లలో నిల్వచేసి, ఆ గబ్బుకొడుతున్న మాంసాన్ని వేడివేడిగా వండి వడ్డించడం అక్రమవ్యాపారులకు సర్వసాధారణమైపోయింది. బిర్యానీల పేరుతో, రకరకాల వంటకాలతో వాటిని వడ్డించి, జనం ఇష్టపడి తినే చికెన్, మాంసాహారాన్ని కూడా కల్తీచేసి డబ్బులు గుంజేస్తున్నారు. ఇటీవల అధికారుల తనిఖీల్లో అలాంటి రెస్టారెంట్ల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ తనిఖీలు ముమ్మరంగా జరిగితే, ఇంకెన్ని చోట్ల ఇలాంటి బండారాలు బయటపడతాయో చెప్పలేం!.. ప్రజారోగ్యాన్ని మంటకలిపే ఇలాంటి ఘోరమైన వ్యాపారాలకు నెల్లూరుజిల్లా కేరాఫ్ అడ్రస్‌గా మారుతుండడం విచారకరం.*

### పొరుగు రాష్ట్రాల నుంచి.. జిల్లాకు కుళ్ళిన చికెన్ వ్యర్థాలు

తమిళనాడు, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి, వారు ఛీ అంటూ పారేసిన, కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాలను జిల్లాలోకి అత్యంత రహస్యంగా వాహనాల్లో తీసుకొచ్చి జిల్లాలో ఉన్న తమ చేపలగుంటల్లో వేస్తున్నారు. ఆ ముసుగుడు చికెన్ తింటే చేపలు బాగా బలిసి, బరువు పెరుగుతాయని, దాంతో లాభాలార్జించవచ్చని కొంతమంది నిరంతరం అదేపనిగా కోళ్ళ వ్యర్థాలను తీసుకొస్తున్నారు. ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు మండలాలతో పాటు జిల్లాలోని అనేకప్రాంతాల్లో పొలాల మధ్యలో ఉంటున్న చేపలగుంటల్లో వ్యాపారులు యథేచ్ఛగా కుళ్ళిన కోళ్ళ వ్యర్థాలను రాత్రికిరాత్రి తీసుకువచ్చేసి చేపలగుంటల్లో వేసేస్తున్నారు. అలాంటి ముసుగుడు చికెన్‌తో వెళ్తున్న కొన్ని వాహనాలు చెక్‌పోస్టుల వద్ద దొరికిపోతున్నాయి కానీ, పోలీసుల కళ్లుగప్పి జిల్లాలోకి దొంగచాటుగా వచ్చేస్తున్న వాహనాలు బోలెడు. తాజాగా ఈనెల 8న విడవలూరు మండలం వద్ద చికెన్ వ్యర్థాల వాహనం ఒకటి పోలీసులకు దొరికిపోయింది. భయంకరమైన ఆ దుర్గంధాన్ని భరించలేక గ్రామస్తులే ఆ వాహనాన్ని పోలీసులకు పట్టించడం విశేషం. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎన్నో జరుగుతూనే ఉన్నాయి. కానీ, పట్టించుకునేవారు లేరు.

ఈ ముసుగుడు చికెన్ల వ్యాపారం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా క్రమేణా విస్తరిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రెస్టారెంట్లలో వేడివేడిగా..

### 'కుళ్లిన మాంసం' :

గబ్బుకొట్టిపోతున్న చికెన్, మటన్ వగైరాలను రోజుల తరబడి ఫ్రీజర్లలో నిల్వ ఉంచడంతో అవి పురుగులు పట్టినా, ఎంచక్కా బాండ్లల్లో వేసి వేపుళ్లు చేసి, వేడివేడిగా వడ్డించేస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే కాదు, జిల్లావ్యాప్తంగా ఎన్ని డాబాలు, ఎన్ని హోటళ్ళు, ఎన్ని రెస్టారెంట్లలో నిత్యం ఇలాంటి కల్తీ వ్యాపారాలు జరుగుతున్నాయో చెప్పలేం. అడిగేవాళ్ళు, అడ్డుకునేవాళ్లు లేకపోవడంతో ఇలాంటి కల్తీవ్యాపారాలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రజారోగ్యాన్ని పాడుచేస్తూనే ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగితే తప్ప వాటి నియంత్రణ సాధ్యం కాదేమోనంటున్నారు జనం!..

# టీటీడీ ఛైర్మెన్‌గా.. 'టీవీ5' నాయుడు?

(మొదటిపేజీ తరువాయి)



చిత్తూరుజిల్లాకి చెందిన బి.ఆర్. నాయుడు 'న్యూజెన్' ప్రోడక్ట్స్ ఉత్పత్తిదారుడుగా, పారిశ్రామికవేత్తగా, టీవీ 5 వ్యవస్థాపకులుగా సమాజానికి సుపరిచితులు. ఆయనకి 'హిందూ ధర్మం' అనే భక్తి ఛానెల్ కూడా ఉంది.

గత అయిదేళ్లుగా వైసీపీ సిద్ధాంతాలని, ఆ పార్టీ పాలనా విధానాలని ఆయన తమ మీడియా ద్వారా తీవ్రంగా వ్యతిరేకించారు. వైసీపీ నేతలు వాడుతుండిన బూతుపురాణాలను కూడా నాయుడు తమ ఛానెల్ ద్వారా ఖండించారు. అయితే వైసీపీ అధినేతలు కూడా నాయుడిని వదిలిపెట్టలేదు. ఆయనపై అనేక రకాల కేసులుపెట్టారు. అంతే కాకుండా సామాజిక మాధ్యమాల వేదికగా ఆయనని తిట్టించారు. కేబుల్ ఆపరేటర్లని బెదిరించి ఆంధ్రప్రదేశ్‌లో టీవీ5 ఛానెల్ ప్రసారాలని నిలిపేశారు. వీటన్నిటికీ నాయుడు జంకలేదు, వైసీపీ సామాజిక మూకని ధీటుగా ఎదుర్కొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలోని కూటమికి తమ టీవీ 5 ఛానెల్ ద్వారా నాయుడు పూర్తి మద్దతు తెలిపారు. కూటమి విజయంలో తమ ఛానెల్ కూడా భాగస్వామి అయ్యేలా పనిచేశారు. తమకి పూర్తిస్థాయి మద్దతు అందించిన బీ.వీ.నాయుడికి కృతజ్ఞతగా ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వరస్వామి సేవాభాగ్యం కల్పించబోతున్నట్లు ముఖ్యమంత్రి కోటరీనుండి అందిన సమాచారం. త్వరలోనే ఆమేరకు ప్రకటన రావొచ్చు.




# సేవోత్సవంగా.. 'కళామందిర్' వార్షికోత్సవం

వస్త్రప్రపంచంలో తనదంటూ ప్రత్యేకత సాధించుకుని, వ్యాపార రంగంలోనే కాక సామాజిక సేవా రంగంలో కూడా తనదైన శైలితో అందరి మన్ననలందుకుంటున్న 'కళామందిర్' సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలు జులై 7న హైదరాబాదు, గచ్చిబౌలీలోని ప్రధాన్ కన్వెన్షన్స్‌లో అంబరాన్నంటే సంబరంగా జరిగాయి. సాయి సిల్క్స్ (కళామందిర్) లిమిటెడ్ ఆధ్వర్యంలో 'కళామందిర్ ఫౌండేషన్' సారధ్యంలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన పలువురు మంత్రులు, రాజకీయ, వ్యాపార, సినీ రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'కళామందిర్ ఫౌండేషన్' వారు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం విశేషం. విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం, చేనేతకారులకు చేయూతనివ్వడం, అనాధాశ్రమాలకు విరాళాలు ఇవ్వడం, దివ్యాంగులను ఆదరించడం వంటి కార్యక్రమాలతో కళామందిర్ వార్షికోత్సవం.. ఒక సేవోత్సవంగా జరిగింది. ఈ సందర్భంగా సమాజానికి ఉత్తమ సేవలందిస్తున్న అయిదుగురికి 'సేవా రత్న' అవార్డులను కూడా బహుకరించి ఘనంగా సత్కరించారు. తాము సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని సమాజసేవకు కేటాయించి, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో 'కళామందిర్ ఫౌండేషన్' తన విశిష్టతను చాటుకుంటోంది. ఈ సంబరాల్లో 'కళామందిర్' వ్యవస్థాపక ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ పాల్గొని అతిథులను ఆత్మీయంగా పలకరించి స్వాగతించారు. తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి అనిత, శాసనసభ్యులు గంటా శ్రీనివాస్, రఘురామకృష్ణరాజు, చింతమనేని ప్రభాకర్, తెలంగాణ ఐటీశాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్, సినీ ప్రముఖులు మురళీ మోహన్, బ్రహ్మానందం, బోయపాటి శ్రీనివాస్, హరీష్ శంకర్, శ్రీకాంత్ తదితరులంతా పాల్గొని కళామందిర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవలను కొనియాడారు.



## టీటీడీలో శ్యామలరావుకి తోడుగా..
# వెంకన్న సేవ కోసం వెంకయ్యచౌదరి!



తిరుమల తిరుపతి దేవస్థానాల అదనపు ఈఓ (జేఈఓ)గా చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని ప్రభుత్వం నియమించబోతోంది. వైసీపీ ప్రభుత్వానికి ముందు చంద్రబాబు హయాంలో వెంకయ్య మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. వైసీపీ వచ్చాక ఆయన తన మాతృసంస్థకి వెళ్లిపోయారు. ప్రస్తుతం కేంద్ర జిఎస్టీ మరియు కస్టమ్స్ విభాగంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ధర్మారెడ్డి అఘాయిత్యాలతో అధోగతిపాలైన తిరుమల తిరుపతి దేవస్థానాలని ప్రక్షాళన చేయడానికి ఇప్పటికే శ్యామలరావుని ఈఓగా నియమించిన చంద్రబాబు ప్రభుత్వం, శ్యామలరావుకి తోడుగా చిరుమామిళ్ల వెంకయ్యచౌదరిని అదనపు ఈఓగా నియమించిబోతున్నట్లు ముఖ్యమంత్రి సన్నిహిత వర్గాలనుండి అందిన సమాచారం.




# ఉత్తరక్రియలు

అనురాగానికి పర్యాయపదం, ఆప్యాయతకు దర్పణం,
మంచితనంతో అందరి హృదయాలలో
చెరగని ముద్రవేసుకున్న మా ఇంటి దైవం,
మా మార్గదర్శి, వెంకటరమణ విలాస్ మరియు
మయూరి రెస్టారెంట్ అధినేత
**శ్రీ వీరిశెట్టి వెంకట సుబ్బారావు గారు**
పరమపదించడం మా కుటుంబానికి తీరని లోటు.
దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

భార్య : శ్రీమతి నళిని వీరిశెట్టి

కీ॥శే॥ వి. వెంకట సుబ్బారావు గారు
జననం : 09-08-1962 • మరణం : 29-06-2024

కుమార్తెలు - అల్లుళ్లు :
పుష్పవల్లి - చంద్రమౌళి
నీరజ - కీర్తిచంద్ర
లిఖిత - వంశీకృష్ణ
మనుమరాలు : లిరీష, కార్తీష

సోదరులు - వదినలు :
హజరత్‌బాబు - యమున
ప్రసాదరావు - శుభశ్రీ
బావమరిది :
బంగారుబాబు

పెద్దకర్మ : తేది: 17-07-2024, బుధవారం ఉదయం 10.00 గం॥లకు రమేష్‌రెడ్డినగర్‌లో మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు అందరికి తెలియజేయడమైనది.

లాయర్
జులై 12, 2024

# 'విభజన కష్టాలు' తీరేందుకు..మార్గం సుగమం

ఎట్టకేలకు దాదాపు పదేళ్ళుగా వీడని చిక్కుముడులుగా ఉన్న విభజన కష్టాలు తీరిపోయేందుకు మార్గం సుగమమైంది. ఉమ్మడి రాష్ట్ర విభజనతో ఏర్పడిన సమస్యలను ఇకనైనా పరిష్కరించుకునేందుకు ఆంధ్ర-తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలు సుహృద్భావంతో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి అడుగు ముందుకు వేయడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ సంతోషభరితమైన వాతావరణం నెలకొంది. మొన్నమొన్నటిదాకా ముఖ్యమంత్రిగా జగన్ ఉన్నా, విభజన కష్టాలు తీరుతాయని అనుకున్నా.. ఇదిగో-అదిగో అంటూనే పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. ఎవరూ ఊహించని ప్రజాతీర్పుతో చివరకు ఆయన సీఎం పదవి నుంచి దిగిపోయారు కూడా. దీంతో కొత్త ముఖ్యమంత్రులు రంగంలోకి దిగారు. ఏళ్ల తరబడిగా పేరుకుపోయిన సమస్యలపై దృష్టి సారించారు. రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు హైదరాబాదులో ఇటీవల జరిగిన సమావేశంలో, విభజన కష్టాలకు సంబంధించిన విషయాలపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, పెండింగ్ సమస్యలను మూడంచెల విధానంలో పరిష్కరించుకోవాలని, రెండు రాష్ట్రాల ప్రజలకు ఆమోద యోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించుకోవడం శుభపరిణామం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతీసుకుని ఒకడుగు ముందుకు వేసి తెలంగాణ సీఎంకు లేఖ రాయడం, తెలంగాణ సీఎం అందుకు వెంటనే అంగీకారం తెలపడంతో విభజన అంశాలపై ఇప్పుడొక కదలిక వచ్చింది. విభజన చట్టంలోని 9,10 షెడ్యూళ్లలోని అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, అధికారులతో కూడిన కమిటీలు వేసి, సమస్యలు చర్చించి పరిష్కారానికి సూచనలు తీసుకోవాలని, వాటిలో పరిష్కారం కుదరనివాటిపై మంత్రుల కమిటీ చర్చించి నిర్ణయం తీసుకోవాలని, ఈ రెండంచెల్లో అంగీకారం కుదిరిన వాటికి ఇద్దరు ముఖ్యమంత్రులు ఆమోదముద్ర వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించుకున్నారు. ఎంతో కీలకమైన ఈ భేటీలో విభజన అంశాలకు సంబంధించి పలు సంస్థలకు చెందిన ఆస్తులు, అప్పులు, నగదు నిల్వ పంపిణీ వగైరాలన్నీ చర్చకు రావడం, కేంద్ర హోంశాఖ ఇదివరకే నియమించిన షీలాబిడే కమిటీ సిఫారసుల్లోని అంశాలను ఇరురాష్ట్రాల అధికారులు ఇచ్చిపుచ్చుకోవడం, విద్యుత్ బకాయిలు తదితర అనేక అంశాలపై అభిప్రాయాలు పంచుకోవడం వంటివన్నీ రెండు రాష్ట్రాల ప్రజలకు సంతోషం కలిగించేవే. ఎంతటి సమస్యలైనా కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాక ఎక్కడికిపోతాయనే సదవగాహనతో ఇద్దరు ముఖ్యమంత్రులు ఏకాభిప్రాయంతో సమస్యల సాధనకు కృషి ప్రారంభించడం తెలుగుజాతి చరిత్రలోనే మరో ఘనమైన మలుపు.

రాష్ట్ర విభజనతో అన్నపూర్ణ వంటి ఆంధ్ర అనాధ కావడం, రాజధాని కూడా లేకపోవడం, అప్పుల్లో కూరుకుపోవడం వంటి సమస్యలతో రాష్ట్రం పదేళ్ళుగా 'అవశేషాంధ్ర'గా అల్లాడిపోయిన విషయం తెలిసిందే. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఇలాంటి కష్టాలన్నీ తీరిపోతాయనుకుంటే, ఆయన పాలనలోని అస్తవ్యస్త విధానాలతో రాష్ట్ర భవిత అగమ్యగోచరంగా మారడంతో ప్రజల వేదన అంతా ఇంతా కాదు. రూ.50 వేల కోట్లుంటే చాలు అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, తెలంగాణ నుంచి రావాల్సిన బకాయిలే వేలాది కోట్లు ఉన్నాయని, వాటిలో సగం వచ్చినా అమరావతి నిర్మాణానికి ఇబ్బంది ఉండదని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపధ్యంలో మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో బకాయిల లెక్కలన్నీ ఒక కొలిక్కి వస్తాయని, ఇక అమరావతి రాజధానికి దిగుల్లేదని సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. అన్నదమ్ములు కలిసి వుంటే ఎంతో మేలని, ఒకరికొకరు సహకరించుకుంటూ సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తుండడంతో... రాష్ట్రాభ్యున్నతికి అడ్డంకులు ఉండవని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఎన్డీఏలో తెలుగుదేశం భాగస్వామి కావడం, జనసేన అందుకు నేనున్నానంటూ తోడుగా నిలవడం, బీజేపీ నేతలు కూడా ఆంధ్ర అభివృద్ధికి వెన్ను దన్నుగా నిలవడం వంటివన్నీ ఆంధ్రకు శుభసూచకాలేనని అనడంలో సందేహం లేదు. పోలవరం నిర్మాణానికి, అమరావతి ఏర్పాటుకు, ఇతరత్రా అనేక ప్రాజెక్టులకు అవసరమైన నిధులిచ్చి ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రధాని మోడీని కలసి విజ్ఞప్తిచేయడం, అందుకు ప్రధాని సానుకూలంగా స్పందించడం మరెంతో ఆశావహమైన మార్పుకు సంకేతం. ఇదే అదనుగా కేంద్రం అండదండలతో రాష్ట్రానికి ప్రత్యేకహోదా కూడా సాధించుకోగలిగితే ఆంధ్ర అభివృద్ధికి ఇక ఢోకా ఉండదనడంలో ఎలాంటి సందేహం లేదు.

# బాబు జపం మానవయ్యా జగనా!

రాష్ట్రం విడిపోయింది... అతః పాతాళానికి పడిపోయింది..! ఇదేం బాబు పిచ్చుండీ బాబూ...! లోకేష్ భాషలో చెప్పాలంటే పులివెందుల ఎం.ఎల్.ఏ జగన్ మోహన్‌రెడ్డి కొంచం చంద్రబాబు పిచ్చి తగ్గించుకుంటే మంచిది. మొన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించడానికి నెల్లూరు జైలుకెళ్లిన జగన్ వైఖరి చూసి నాకు మెంటలొచ్చింది. జైలు బయటకొచ్చి మీడియాతో ఆయన మాట్లాడిన మాటలు విని జగన్‌కేమైనా చేతబడి జరిగిందా అన్న అనుమానం కలిగింది. గత ఎన్నికలలో... అంటే 2019లో జగన్ గెలిచిన క్షణం నుండి అయిదేళ్లపాటు ఆయన చంద్రబాబు జపమే చేశాడు. జనం మర్చిపోయినా బాబుని జగన్ మాత్రం మర్చిపోలేదు. జనాన్ని కూడా బాబుని మర్చిపోనీయలేదు. అందుకే వాళ్ళు ఈ ఎన్నికలలో బాబుని గుర్తుపెట్టుకుని జగన్‌ని మర్చిపోయారు. బాబు అధికారం చేపట్టి ఇంకా ఒక నెలైనా కాకముందే "చంద్రబాబూ జాగ్రత్త..! నీ పాపం పండే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. నిన్ను హెచ్చరిస్తున్నా" అంటూ మళ్ళీ బాబు నామస్మరణ మొదలుపెట్టాడు. ఒకసారి ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడితే 5 సంవత్సరాలు ఆ ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. జగన్ అది కూడా మర్చిపోయి నట్లున్నాడు. మరో 5 నెలలో మళ్ళీ తానే అధికారంలోకి రాబోతున్నట్లుగా మాట్లాడుతున్నాడు. అదేదో సినిమాలో "వీడికి పువ్వుల్ని అమ్మాయిలని చూపించండిరా" అని రావు రమేష్ చెప్పినట్టు... ఈ జగన్‌కి ఎవరైనా రాజకీయం నేర్పించండయ్యా..!

ఎం.ఎల్.ఎన్.రెడ్డి - బెంగళూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# చుక్కలు చూపిస్తున్న కుక్కలు!

"చిల్డ్రన్ పార్కులో వాకింగ్ కోసం వెళ్లిన 8 మందిని కరిచిన కుక్కలు", "గాయత్రినగర్‌లో వృద్ధురాలిని కరిచిన కుక్క", "మాగుంట లే అవుట్‌లో ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేసిన కుక్కలు"... ఇలాంటి వార్తలు పత్రికలలో నిత్యం వస్తూనే ఉన్నాయి. ఇవి వెలుగులోకి వచ్చిన కొన్ని సంఘటనలు మాత్రమే. వెలుగులోకి రానివి నగరంలో పలుచోట్ల చాలా జరుగుతున్నాయి. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా నెల్లూరు నగర కార్పొరేషన్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. పన్నుల వసూళ్ళపై పెడుతున్న శ్రద్ధలో పది శాతం కూడా ప్రజల ఇబ్బందులపై పెట్టడంలేదు. నగరమంతా వందల సంఖ్యలో విస్తరించిన కుక్కలు ప్రజలని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చేతిలో కర్ర లేకుండా కాలు బయటపెట్టాలంటే జనం వణికిపోతున్నారు. జనానికి చుక్కలు చూపిస్తున్న ఈ కుక్కల నియంత్రణపై నగర పాలకులు వెంటనే దృష్టిపెట్టాలి.

ఆర్.పి.రామయ్య - కొండాయపాలెం.

# వాళ్ళిద్దరికీ పోలికే లేదు!

"నాన్న అలా ... కొడుకు ఇలా" అని గత వారం 'లాయర్'లో వచ్చిన మొదటి పేజీ వార్త వై.ఎస్. అభిమానులకి మన స్తాపం కలిగించినా, ఆలోచింపదగిందిగా ఉంది. ముఖ్యంగా మన 'లాయర్'లో ఇలాంటి విశ్లేషణ రావడం కొంచెం బాధా కరం. అయితే... ఆ వ్యాసంలో రాసిన ప్రతీ అక్షరం వాస్తవమే. ఆయనలో వున్న ఒక్క సుగుణం కూడా జగన్‌మోహన్‌రెడ్డికి రాలేదు. రాజశేఖరరెడ్డికి నటించడం రాదు. జగన్ మహానటుడు. రాజశేఖరరెడ్డికీ, జగన్‌కీ ఏ విషయంలోనూ పోలికే లేదు.

వి.లక్ష్మీభరద్వాజ్ - హైదరాబాదు.




# భారత్‌లో భక్తికి భద్రత కావాలి

భగవంతునిపై భక్తితో, తమ ఆచారాలపై నమ్మకంతో గడప దాటి కన్యాకుమారి నుంచి కాశ్మీరం వరకు వేలమైళ్ళు వెళ్లి ఎముకలు కొరికే చలిలో హిమాలయాలను సైతం అధిరోహిస్తున్న వారికి భద్రతా ఉందా? భక్తి భావంతో, ఇల్లు వదిలి రామేశ్వరం నుండి కాశీ వరకు వెళ్తున్న వాళ్లకి మళ్లీ క్షేమంగా ఇంటికి తిరిగివస్తామన్న భరోసా ఉందా??

అసలు భారత్‌లో భక్తికి భద్రత ఉందా???

సమాజంలో పలు సందర్భాలలో జరుగుతున్న సంఘటనలని తరచూ గమనిస్తున్న సామాన్య జనం నుండి వినిపిస్తున్న ప్రశ్నలివి.

మొన్నటి భోలేబాబా సంఘటన, నిన్నటి పూరీ జగన్నాథ రథయాత్ర ఉదంతం చూసిన తరువాత భక్తుల భవిష్యత్తు పట్ల పలు మతాలకి చెందిన వ్యక్తుల నుండి వ్యక్తమవుతున్న అనుమానాలివి. ముఖ్యంగా భారతదేశంలో అత్యధికంగా వున్న హిందువులకి కలిగిస్తున్న ఆందోళన ఇది.

ప్రపంచంలో ఉన్న అన్ని మతాల కంటే ముందు ఆవిర్భవించిన మతం హిందూ మతం అని పరిశోధనలు చెప్తున్నాయి.

హిందూ మతస్థులకు సంప్రదాయాలు, ఆచారాలు చాలా ఎక్కువ.

సెంటిమెంట్లు కూడా ఎక్కువే.

ఏడాది పొడవునా క్రమంతప్పకుండా ప్రతినెలా ఏదోఒక పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించే మతం హిందూ మతం.

అంతేకాకుండా క్రమం తప్పకుండా ప్రతీ ఏడాదీ ఒక పుణ్యనదిలో పుష్కర స్నానం ఆచరించే ఆచారం కూడా ఒక్క హిందూ మతంలోనే వుంది.

ఉదాహరణకి దేశంలో ఉన్న 12 పవిత్ర జీవనదులలో ఒక్కొక్క ఏడాది ఒక్కొక్క చోట పుష్కరాలు జరుగుతాయి.

ఒక్కొక్క రాశిలో గురువు ప్రవేశించేటప్పుడు ప్రతి నదికి పుష్కరాలు జరుపుతారు. అందుకే 12 నదులను పుష్కర నదులని, 12 రోజుల పాటు జరిగే ప్రక్రియను పుష్కరాలని అంటారు. నవగ్రహాల్లో ఒకటైన గురుగ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో తిరుగుతూ ఉంటుంది. చాంద్రమానం ప్రకారం 27 నక్షత్రాలు, తొమ్మిది పాదాలు కలిసి ఒక రాశిగా ఏర్పడతాయి.

ప్రతి సంవత్సరం గురువు ఆయా రాశుల్లో ప్రవేశించినప్పుడు.. అంటే గురువు మేషరాశిలో ప్రవేశించినప్పుడు గంగా నదికి, వృషభరాశిలో ప్రవేశించినప్పుడు నర్మదా నదికి, మిథునరాశిలో ప్రవేశించినప్పుడు సరస్వతి నదికి, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు యమునా నదికి, సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ప్రవేశించినప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ప్రవేశించినప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ప్రవేశించినప్పుడు భీమరథీ నదికి, ధనూరాశిలో ప్రవేశించినప్పుడు పుష్కరవాహిని(తపతి) నదికి, మకర రాశిలో ప్రవేశించినప్పుడు తుంగభద్ర నదికి, కుంభరాశిలో ప్రవేశించినప్పుడు సింధూ నదికి, మీనరాశిలో ప్రవేశించినప్పుడు ప్రాణహిత నదికి పుష్కరాలు వస్తాయి.

ఇలా గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ కావేరి, భీమరథి, తపతి, తుంగభద్ర, సింధు, ప్రాణహిత వంటి జీవనదులను పుష్కర నదులని పిలుస్తారు. ఒక్కో నదికి ఒక్కో రాశి అధిష్టానమై ఉంటుంది. పుష్కర సమయంలో ఆ నదిలో సకల దేవతలు కొలువైవుంటారు. అందుకే ఆ సమయంలో నదిని చేరుకోవడం వల్ల ఆ దేవతలందరిని పూజించినట్లవుతుందని భక్తుల విశ్వాసం. ఇలాంటి అరుదైన పుష్కర స్నానాల సంస్కృతి ప్రపంచం మొత్తంలో ఒక్క భారతదేశంలోనే ఉంది.

ఇలా ప్రతీ ఏడాది ఎక్కడో ఒక చోట జరిగే పుష్కర స్నానాలలో సైతం చాలాసార్లు అపశృతులు చోటు చేసుకుంటున్నాయి.

తాజాగా ఉత్తరప్రదేశ్‌లో భోలేబాబా పేరుతో ఒక సన్యాసి చేసిన తప్పిదం వల్ల 121 ప్రాణాలు బలయ్యాయి. కొన్ని వేలమంది గాయాల పాలయ్యారు.

అంతటి తొక్కిసలాట అనంతరం ఒరిస్సాలోని పూరీలో జరిగిన జగన్నాథ రథయాత్రలో కూడా భద్రతా లోపాలు బట్టబయలయ్యాయి. ఒక నిండు ప్రాణం బలైపోగా 400మందికి పైగా గాయపడ్డారు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మత గురువుల ప్రవచనాలు, పూరి జగన్నాథ్ రథయాత్ర, తిరుమలలో ముక్కోటి వైకుంఠ ద్వారదర్శనం, అమ్మవారి ఆలయాలలో దసరా శరన్నవరాత్రులు, సద్గురు ఇషా ఫౌండేషన్‌లో నిర్వహించబడే మహా శివరాత్రి, శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఘనంగా జరిగే శివరాత్రి ఉత్సవాలు, భద్రాద్రిలో రామయ్యకళ్యాణం, శబరిమలై జ్యోతి దర్శనం, నెల్లూరు దర్గాలో రొట్టెల పండుగ వంటి ప్రత్యేకసందర్భాలలో భక్తులు లక్షలసంఖ్యలో తరలివస్తారు.

భగవంతునిపై తమకున్న భక్తి విశ్వాసాలతో, ఆచారాలపై తమకున్న నమ్మకంతో ఎన్ని వేల కిలోమీటర్లయినా వ్యయప్రయాసలతో ప్రయాణం చేయడానికి సిద్ధపడతారు.

అలాంటి భక్తుల భద్రత కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రత్యేక రోజుల్లో భక్తుల రక్షణ కోసం అవసరమైతే పారా మిలిటరీ దళాలని సైతం రప్పించి భక్తులలో వారి భద్రతపై భరోసా కల్పించాలి. రామమందిరాన్ని నిర్మించి హిందుత్వ ప్రతిష్టని పెంచామని చంకలు గుద్దుకోవడంతో సరిపోదు... ఒక్క ప్రాణమైనా పోకుండా, ఒక్కరికి కూడా చిన్న గాయం కాకుండా లక్షలమంది పాల్గొనే కార్యక్రమాలని పర్యవేక్షించినప్పుడే హిందుత్వానికి నిజమైన గౌరవం. ఒక్క హిందూ మతమే అని కాదు, ఆ కార్యక్రమం ఏ మతానికి చెందిందైనా వారి మనోభావాల్ని గౌరవించి వారికి రక్షణ కల్పించినప్పుడే దేశ ప్రతిష్ట పెరుగుతుంది.

జులై 17వ తేదీ నుండి 22వ తారీఖు వరకూ అయిదు రోజుల పాటు నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ జరగబోతోంది. దేశ విదేశాల నుంచి 25లక్షల నుండి 30 లక్షలమంది వరకూ భక్తులు రావచ్చని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం, పాలకులు, జిల్లా అధికారులు గతానుభవాలని దృష్టిలో పెట్టుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.

భవిష్యత్తులో ఎక్కడా ఉత్తరప్రదేశ్, ఒరిస్సా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి.

భారతదేశంలో భక్తికి భద్రత ఉంది.. అన్న భరోసాని కల్పించాలి!

- రాజశ్రీ

## కార్మికుల పిల్లలకు అండగా..

# శ్రీసిటీ 'రాక్‌వర్త్' పరిశ్రమ

### 12 మంది విద్యార్థులకు రూ. 9 లక్షల ఫీజు చెల్లింపు



కార్మికుల ఉద్యోగ భద్రతకు పెద్దపీట వేస్తున్న శ్రీసిటీలోని రాక్‌వర్త్ పరిశ్రమ, కార్మికుల పిల్లల చదువులకు భరోసా కల్పిస్తోంది. 1వ తరగతి నుంచి ఇంజనీరింగ్ విద్య వరకు విద్యా ఫీజులు (పుస్తకాలు, వాహనం ఫీజుతో సహా) పూర్తిగా చెల్లిస్తూ పిల్లల చదువులను ప్రోత్సహిస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలలో చదువుతున్న వారికి సైతం సంపూర్ణ సాయం అందిస్తోంది. ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్‌కుమార్, తన తల్లి జ్ఞాపకార్థం 'మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్' పేరిట గత మూడేళ్ళుగా ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పరిశ్రమలో దిగువస్థాయి ఉద్యోగులకు, వారి సీనియారిటీ, కుటుంబ ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఎంపిక చేసి, వారి పిల్లలకు చేయూత ఇస్తుండడం విశేషం. ఈ ఏడాది 12 మంది విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా ఫీజులు చెల్లించారు. పరిశ్రమ ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాక్‌వర్త్ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్‌కుమార్ పాల్గొని, ఈ ఏడాది ఫీజు చెల్లింపు రసీదులను పిల్లల తల్లితండ్రులకు అందజేశారు. సుప్రజ్‌కుమార్ అనే ఇంజనీరింగ్ విద్యార్థికి రూ. 1.85 లక్షల ఫీజు మొత్తాన్ని ఇచ్చారు. ఆ విద్యార్థి చెన్నైలోని ఆర్ఎంకె ఇంజనీరింగ్ కళాశాలలో చివరి ఏడాది బిటెక్ చదువుతున్నాడు. వరదయ్యపాళెం మండలం నాగానందపురం గ్రామానికి చెందిన ఆ విద్యార్థి తండ్రి పోలయ్య గత 12 సంవత్సరాలుగా రాక్‌వర్త్ పరిశ్రమలో ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అదేవిధంగా, పదేళ్ళుగా ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన గోపి కుమార్తె దీపిక శ్రీసిటీ చిన్మయ సిబిఎస్ఈ స్కూల్లో 5వ తరగతి చదువుతుండగా, ఆమెకు 85 వేల రూపాయల ఫీజును చెల్లించారు. అదేవిధంగా, శ్రీసిటీ పరిసర గ్రామాలకు చెందిన 12 మంది విద్యార్థులకు మొత్తం 9 లక్షల రూపాయలను తమవంతు సాయంగా అందించి వారి చదువులకు అండగా నిలిచారు.

### అభినందించిన శ్రీసిటీ ఎం.డీ డా. రవీంద్ర సన్నారెడ్డి :

కార్మికుల పిల్లల చదువులకు చేయూతనిస్తున్న రాక్‌వర్త్ కంపెనీ చొరవను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు. శ్రీసిటీ పరిశ్రమల్లోని ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రాక్‌వర్త్ నిబద్ధత ప్రశంసనీయమంటూ ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కంపెనీ నుంచి ఆర్థికసాయం అందుతున్న వారిలో ఎక్కువగా శ్రీసిటీ చుట్టుపక్కల గ్రామస్థులు ఉండడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీలోని ఇతర పరిశ్రమల యాజమాన్యాలు కూడా దీనిని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని మంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తారని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహానేత డా. వై.యస్.

### ○ రాజన్న 75వ జయంతి సభల్లో కొనియాడిన నాయకులు



దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు నెల్లూరులోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా వైకాపా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 8న ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైకాపా నాయకుడు ఖలీల్ అహ్మద్‌లతో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు అభిమానులు డా.వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదానశిబిరంలో యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించి, ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం అమలవుతున్న ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, త్రాగు-సాగు నీటి ప్రాజెక్టులకు జలయజ్ఞం లాంటి పథకాలు డా. వైఎస్ ప్రవేశపెట్టిన సంస్కరణల్లో భాగమేనన్నారు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రానికి మంచి సంక్షేమపాలన అందించారని ఆయన కొనియాడారు.

### నెల్లూరు రూరల్‌లో...



ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, చిరస్థాయిగా అందరి మనసుల్లో నిలిచిపోయిన దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఈనెల 8న ఘనంగా జరిగాయి. రూరల్‌లోని గ్రామీణ ప్రాంతాల వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా ప్రాంతాల్లో ఉండే దివంగత మహానేత డా. వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### వైఎస్‌కు..ప్రసన్న నివాళి



దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా ఈనెల 8న కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాలెం సెంటర్లో డా. వై.యస్. విగ్రహం వద్ద కోవూరు మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ వీరి చలపతి రావు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి రాష్ట్రానికి వైఎస్ చేసిన సేవలను స్మరించుకున్నారు.

### జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సూచనల మేరకు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదేశాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డా. వైఎస్ 75వ జయంతి కార్యక్రమాలు జరిగాయి. కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు ఉడతా వెంకట్రావుయాదవ్ నాయకత్వంలో నెల్లూరులోని వేదాయపాళెంలో కరెంటాఫీసు కూడలివద్దనున్న డా. వైఎస్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు షేక్ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లోని పలువురు ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'చెత్త'తో గబ్బుకొట్టిపోతున్న నెల్లూరు



- గుట్టలుగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- దోమలతో పెరిగిపోతున్న జబ్బులు

*స్మార్ట్ సిటీల్లో ఒకటి అవుతుందను కుంటున్న నెల్లూరు నగరం రానురాను 'చెత్తనగరం'గా మారిపోతోంది. ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, చెత్తకుప్పలు, గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నెల్లూరు గబ్బుకొట్టిపోతోంది. 'ఏ వీధి చూసినా ఏమున్నది గర్వకారణం.. ప్రతి వీధి సమస్తం మురుగుమయం'..అన్నట్లుగా తయారైంది పరిస్థితి.*

నెల్లూరుకు ప్రతిరోజూ నగరంలోని ప్రజలే కాక, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలసంఖ్యలో వచ్చి తమ పనులు, వ్యాపారాలు చూసుకుని పోతుంటారు. అలా వచ్చిన జనమంతా నగరంలోని దుర్గంధ భూయిష్టమైన రోడ్లపైనే వచ్చి వెళ్ళాల్సి ఉంటుంది. అధికారులు, నాయకులు సైతం ఈ రోడ్లమీదనే వాహనాల్లో వెళ్తుంటారు కానీ, ఈ సమస్యలను వారు పట్టించుకోరు. ఇటీవల చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలతో ఆ చెత్తంతా తడిసిపోయి ముగ్గిపోయి మరింత గబ్బుకొడుతోంది. నిత్యం వేలాదిమంది జనం ముక్కులు మూసుకుని వెళ్లే పరిస్థితి. ఎప్పటికప్పుడు చెత్తను ఎత్తివేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నా, ఎంత చెత్త ఎత్తివేసినా అంతకంతా చెత్త రోజూ వచ్చి పడుతూనే ఉంది. అందుకు తగ్గట్టుగా అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు, సరైన ప్రణాళికలు లేకపోవడంతో నగర వీధుల్లో పేరుకుపోతున్న ఈ మురుగు మరింత జుగుప్సాకరంగా ఉంటోంది. అసలే దోమలనగరంగా ప్రసిద్ధిగాంచిన నెల్లూరులో ఈ మురుగుకూపాలతో దోమలు మరింతగా ప్రబలిపోతున్నాయి. దోమల నివారణకంటూ గత ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు గొప్పలు చెప్పుకున్నా, నేటికీ అవేమీ ఆచరణకు రాక పరిస్థితి నరకంగానే ఉంది.

### నడవాలంటే నరకయాతన

నెల్లూరులో ప్రముఖ వ్యాపారకూడళ్లుగా పేరుమోసిన ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజారు, పెద్దబజారు, కూరగాయల మార్కెట్ తదితర అనేక ప్రాంతాల్లో పరిశుభ్రత అన్నది భూతద్దం పెట్టి వెతికి చూసినా కనపడదు. రోడ్ల మీదా, రోడ్లకు రెండుపక్కలా చెత్తాచెదారం పేరుకుపోయి పాదచారులు నడవాలంటేనే నరకయాతనగా ఉంటోంది. డంపింగ్‌యార్డులు కూడా చాలినంతగా లేకపోవడంతో, గత కొద్దికాలంగా నెల్లూరు చెరువుకట్ట ప్రాంతంలో కూడా ఎవరిష్టమొచ్చినట్లు వాళ్లు చెత్తనంతా తెచ్చి పడేస్తుండడంతో పేద ప్రజలు నివాసం ఉండే ఇరుగోళమ్మ కూడలి ప్రాంతంలో పెద్ద డంపింగ్ యార్డుగా తయారైంది. జొన్నవాడకు వెళ్లే ఆ రోడ్డంతా దాదాపు రెండు కిలోమీటర్ల దూరం చెత్తాచెదారమంతా తెచ్చి పోస్తుండడంతో, ఆ దారిలో వెళ్లే వాహనాలవారికి ఇబ్బందిగా ఉంటోంది. నెల్లూరు నగరం మునిసిపాలిటీస్థాయి నుంచి నగరపాలక సంస్థగా మారిందని గొప్పే గానీ, ఈ మురుగు సమస్యలకు మాత్రం మోక్షం కలగడం లేదు.

### పరిశుభ్రత లేని ఖాళీస్థలాలు

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న ఖాళీస్థలాలు మురుగుదిబ్బలుగా మారిపోయాయి. వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాటి యజమానులకు చెప్పినా ఫలితం శూన్యం. దీంతో చిన్న వానకే ఆ ఖాళీస్థలాల్లో నీళ్ళు మడుగులు కట్టి మురికి గుంటలుగా తయారవుతున్నాయి. సందులు గొందుల్లో ఉన్న ఈ స్థలాలు అనేక చోట్ల పందుల గుంపులకు ఆవాసాలుగా ఉంటున్నాయి. మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులకు పందులు ప్రధాన కారణంగా ఉన్నా, జనావాసాలకు దూరంగా వాటిని తరలించాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలు నేటికీ ఫలించలేదు. ఫలితంగా నగరం పరిస్థితి ఎంతో కాలంగా ఎక్కడవేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంది. జిల్లాకే తలమానికమైన, ఉత్తర శ్రీరంగంగా ఖ్యాతిగన్న శ్రీ రంగనాథ క్షేత్రం, అందులోనూ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి నివాసం ఉన్న రంగనాయకులపేటలో కూడా ఇదే దుస్థితి. ఇకనైనా కొత్తప్రభుత్వం, కొత్త అధికారులైనా ఈ సమస్యలను పట్టించుకోవాలి. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న ఈ చెత్తాచెదారాన్నీ, మురుగు దిబ్బలను ఎప్పటికప్పుడు తొలగించి, నగరంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలి.

# నెల్లూరు కబుర్లు

## మంత్రులను కలిసిన కలెక్టర్ ఆనంద్



జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎ.ఆనంద్ ఇటీవల రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణలను మంత్రి ఆనం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్‌తో మంత్రులు పలు విషయాలపై చర్చించి, జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయనకు పలు సూచనలు చేశారు.

## నెక్లెస్ రోడ్డు పనులు ప్రారంభిస్తాం

- మంత్రి నారాయణ



నెల్లూరులో స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద నిలిచిపోయిన అభివృద్ధి పనులను, ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన స్వర్ణాల చెరువు, ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డును, పరిసర ప్రాంతాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014-19మధ్యలో తాము ప్రారంభించి ఆగిపోయిన పనులను త్వరలో పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామని, నగర ప్రజలకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని తప్పకుండా నెరవేరుస్తామన్నారు.

## 20 నుంచి.. 'గురుపూర్ణిమ' ఉత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్ చివర, పద్మావతి నగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 20 నుంచి 22వ తేది వరకు అత్యంత వైభవంగా 'గురుపూర్ణిమ' మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా సాయినాథునికి విశేష అలంకారాలు, ప్రత్యేక పూజలు, సేవలు, హారతులు నిర్వహిస్తామని, 21న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ సాయినాథ సంకీర్తన, ఆ తర్వాత పందరిభజనలు, కోలాటాలు కోలాహలంగా జరుగుతాయని మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాపోలు రామసుబ్బయ్య తెలిపారు. మందిర నిర్వాహకులు, సత్సంగ్ సేవాదళ్ సభ్యుల పర్యవేక్షణలో జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ సాయినాథుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

'విలువిద్య'లో సత్తా చాటుతున్న..

## డా. కిషోర్స్ రత్నం విద్యార్థినులు



నెల్లూరులోని డా.కిషోర్స్ రోషిణి రత్నం స్కూల్ విద్యార్థినులు విలువిద్య (ఆర్చరీ)లో తమ సత్తా చాటుకుంటున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో, అండర్-13 బాలికల కాంపౌండ్ విభాగంలో మెరికలుగా రాణించి జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యారు. డా. కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్‌లో 8వ తరగతి చదువుకుంటున్న కె.జనని, 7వ తరగతి చదువుతున్న కె.మోక్ష రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగడం పట్ల తమ విద్యార్థినులను విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. స్థానిక సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఏటీజెడ్ (యాక్టివిటీ టైమ్ జోన్)లో కోచ్‌లు భరద్వాజ, చాముండేశ్వరిల వద్ద వారు శిక్షణ పొందారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. అభినందన కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

విఎస్‌యు రిజిస్ట్రార్ సునీత



మానవ మనుగడకు ప్రాణప్రదమైన పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు మొక్కలు నాటడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని నెల్లూరులోని విఎస్‌యు (విక్రమసింహపురి యూనివర్శిటీ) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత చెప్పారు. ఈనెల 6న యూనివర్శిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. మొక్కలు నాటి సంరక్షించడాన్ని అందరూ విధిగా పాటించాలని సూచించారు. డెప్యూటి రిజిస్ట్రార్ సాయిప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ వై.విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయశంకర్ పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఎన్జీఓ నాయకుల శుభాకాంక్షలు



కొత్తగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కు ఏపీ ఎన్జీఓ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 9న కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, విజయకుమార్, పెంచలయ్య, సువర్ణ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్

## ఆశయాల బాటలో నడవాలి

మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు అపారమని, ఆయన ఆశయాల బాటలో అందరూ నడవాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్యమాదిగ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న నెల్లూరులోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. నాయకులు రఘు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ.ఆనంద్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఆమె కలెక్టర్‌తో చర్చించారు. ప్రశాంతిరెడ్డి వెంట టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

- జాతీయ కమిషన్ సభ్యులు డా.పీపీ వావ -



సఫాయి కర్మచారీల (వ్యర్థాలను తొలగించేవారు) జీవన స్థితిగతులను మెరుగుపరచడంతోపాటు, వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని సఫాయికర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వావ పేర్కొన్నారు. ఇటీవల ఆయన నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, ఇతర జిల్లా అధికారులతో సఫాయి కర్మచారుల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పాటుపడే సఫాయి కర్మచారుల సేవలు అమూల్యమని, వారి ఆర్థిక పురోభివృద్ధికి అందరూ కృషిచేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో సఫాయి కర్మచారులకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలన్నారు. పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే బాధితులకు రూ. 10 లక్షల నుంచి 30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆయన సూచించారు.

## కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ బదిలీ



నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ బదిలీ అయ్యారు. ఆయన్ను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 9న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఏడాది కిందట రాష్ట్ర సచివాలయాల విభాగం నుంచి ఆయన నెల్లూరు కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వచ్చారు. నిబద్ధతతో పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవల ఆయన సంతకాలను ఎవరో ఫోర్జరీ చేశారంటూ కార్పొరేషన్‌లో దుమారం రేగింది. ఆ విషయం ఎటూ తేలకుండానే ఆయన బదిలీ అయ్యారు.

## వ్యాసరాజ మఠంలో.. ఉడుపి పీఠాధిపతి



నెల్లూరు సంతపేటలోని వ్యాసరాజ మఠాన్ని ఈనెల 9న ఉడుపి శిరూర్ మఠం పీఠాధిపతి సందర్శించి, మఠంలో జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు ప్రహ్లాదాచారి ఆయనకు స్వాగతం పలికారు. మఠం మేనేజర్ రవీంద్రబాబు, గౌరవాధ్యక్షుడు ఆర్వపల్లి సుబ్బారావు, సింహపురి మధ్వసంఘం అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## డిక్షనరీలు వచ్చేశాయ్

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు అందజేసేందుకు డిక్షనరీలు వచ్చేశాయి. వాటిని నెల్లూరులో విద్యాశాఖాధికారులు భద్రపరిచారు. త్వరలోనే మండల కేంద్రాలకు వాటిని పంపుతారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు అందజేయనున్నామని సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి తెలిపారు.



# 'ఉచితంగా ఇసుక'.. ప్రజలకు కానుక

## చంద్రబాబును కొనియాడిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రజల కోసం చేపట్టిన 'ఉచితంగా ఇసుక పంపిణీ విధానం'.. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన కానుక అని, రాష్ట్ర చరిత్రలోనే ఇది ఓ సువర్ణాధ్యాయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. ఈనెల 8న ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉచిత ఇసుక విధానాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రజలకు పారదర్శక విధానంతో ఇసుక అందించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నారన్నారు. ఇసుక అక్రమ వ్యాపారాల్లో గత వైకాపా ప్రభుత్వం దాదాపు 50వేల కోట్ల రూపాయల మేరకు అవినీతికి పాల్పడిందని ఆమె ఆరోపించారు. వారు దోచుకున్న ఇసుకతో పేదలకు 10లక్షల ఇళ్ళు కట్టి ఇవ్వవచ్చని అన్నారు. సీఎం అయిన నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని తెచ్చి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారన్నారు. ఎక్కడా పర్యావరణ చట్టాల ఉల్లంఘన జరగకుండా ఇసుక విధానం అమలు చేస్తామని, ఈ విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మైనింగ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

### ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లులో 'ఉచిత ఇసుక విధానాన్ని' ప్రశాంతిరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ, ఉచిత ఇసుక పథకంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామంలోని మహబూబ్ సుభాని దర్గాను సందర్శించారు. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మహబూబ్ సుభాని దర్గాలో 101 టెంకాయలు కొడతామని స్థానిక ముస్లిం నాయకులు మొక్కుకున్నారు. ప్రశాంతిరెడ్డి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ముస్లిం నాయకులు జలాలుద్దీన్, షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కుబడి చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

### పాదయాత్ర నాయకులకు అభినందన

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కనగాల మధు నాయకత్వంలో చేపట్టిన 'గుంటూరు నుంచి తిరుమల'కు కాలినడక యాత్ర ఇటీవల నెల్లూరు చేరుకుంది. పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆమె అభినందించారు. క్షేమంగా తిరుమల చేరుకొని మొక్కు చెల్లించుకోవాలని ఆమె సూచించారు.

### నగర పాఠశాలల్లో 12న..

# వన మహోత్సవం

## ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆధ్వర్యంలో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమం




ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ కోసం నెల్లూరులోని పాఠశాలల్లో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్-నెల్లూరు భారీ సన్నాహాలు చేస్తోంది. నెల్లూరు కేంద్రీయ విద్యాలయం ప్రాంగణంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథులు. వారిరువురి చేతుల మీదుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ సహకారంతో నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ఈ కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించి, త్వరలోనే పూర్తి చేయనున్నట్లు భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తెలియజేశారు. నెల్లూరు సామాజిక వనవిభాగం డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమానికి ఉచితంగా మొక్కలు అందజేస్తున్నారని, మొక్కలునాటే ఆసక్తి ఉండి, అమ్మ పేరిట మొక్క నాటాలనుకున్న వారికి ఉచితంగా మొక్కలు అందిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి శుభమస్తు షాపింగ్‌మాల్, కంచి పెరుమాళ్ సిల్క్స్, వారధి ఫౌండేషన్‌లు సహనిర్వాహకులుగా, 'లాయర్' వారపత్రిక, యాక్ట్, రెడ్ ఎఫ్ఎంలు మీడియా భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయని ఆయన వివరించారు. 'అమ్మ పేరిట ఒక మొక్క' అనేది కేవలం ఒకరోజు కార్యక్రమం మాత్రమే కాదని, మొక్కలు పూర్తిస్థాయిలో నాటేవరకు జరుగుతుందని, ఈ వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. తమ పాఠశాలల్లో, కార్యాలయాల్లో, ఇళ్ళల్లో, వ్యాపార ప్రాంగణాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి 'ప్లాంట్ ఫర్ మదర్'తో గాని, లేదా హ్యాష్‌ట్యాగ్‌లతో కానీ, సామాజిక మాధ్యమాల్లో ఆ ఫోటోలు పంచుకోవాలని ఆయన సూచించారు.






## ఆత్మీయ అభినందనలు



రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణను ఆయన నివాసంలో కలిసి అభినందిస్తున్న 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).

# చేసేదంతా దోపిడీ.. చెప్పేవన్నీ అబద్ధాలు

## --- మాజీమంత్రి కాకాణిపై సోమిరెడ్డి మండిపాటు ---



'ఆయన చేసేదంతా దోపిడీ.. చెప్పేవన్నీ అబద్ధాలే'నంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. రెండు రాష్ట్రాల ప్రయోజనం కోసం హైదరాబాదులో ఆంధ్ర- తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశాన్ని నిర్వహిస్తే, దానిని అభినందించాల్సింది పోయి కాకాణి అవాకులు. చెవాకులు పేలడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకాణి తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు. తిరుమలను వైకాపా ప్రభుత్వం అవినీతి కేంద్రంగా మార్చిందని, ఆ క్షేత్రం పేరెత్తే అర్హత కూడా వారికి లేదని విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లలో ఒక సీఎం ప్యాలెస్‌కు, మరో సీఎం ఫామ్‌హౌస్‌కి పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఒకరి రాష్ట్రంలో మరొకరు ఆస్తులు దోచుకునే లోపాయకారి ఒప్పం దాలతో సర్దుకున్నారని, సీనియర్ నాయకుడైన చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి నెల గడవకముందే రెండు రాష్ట్ర ప్రయోజనాల కోసం శ్రమిస్తున్నారని ఆయన వివరించారు. ప్యాలెస్‌లలో కూర్చునుండేవారికి ప్రజల కష్టాలు ఏం తెలుస్తాయని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి జనంలోకి రావాలంటే రోడ్డపక్కన చెట్లు నరకాలి.. హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటే కింద దుకాణాలు మూసేయాలి..అంటూ, ఇదెక్కడి విడ్డూరమన్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో ఇరుక్కుని కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన వాటా నిధులను తెచ్చుకోవడంలో జగన్‌మోహన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. వ్యవసాయశాఖ పరిధిలో కేంద్రం నుంచి రావల్సిన 60 శాతం నిధులను తెచ్చుకోలేక అనేక కీలక పథకాలను మూలనపెట్టిన మీరు రాష్ట్రాలు, వాటాలు గురించి మాట్లాడుతారా అని నిలదీశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా అట్టర్‌ఫ్లాప్ అయి సర్వేపల్లిలో కూర్చుని ఇసుక, మట్టి, గ్రావెల్, తెల్లరాయి, టోలు గేట్ దందాలతో బతికారంటూ కాకాణిని ఆయన దుయ్యబట్టారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి చేసిన అక్రమాలు, దోపిడీ, అవినీతి దేనినీ వదిలి పెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వందల మంది టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించాడు, వందల మందిని జైళ్లకు పంపించాడు చేసిన ప్రతి తప్పుకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫలితం అనుభవించాల్సిందేనన్నారు. కాకాణి చేసిన పాపాలకు ఇప్పటికే ఎందరో సస్పెండ్ అయ్యారు. ఇంకెంతమంది అధికారులు సస్పెండ్ అవుతారో, ఎంత మంది జైళ్లకు వెళుతారో చూద్దాం అని ఆయన అన్నారు.

# జిల్లాకు త్వరలో..110 కొత్త బస్సులు

నెల్లూరుజిల్లాకు త్వరలో 110 కొత్త బస్సులు వస్తాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.విజయరత్నం చెప్పారు. ఈనెల 9న ఆయన రాపూరులోని ఆర్టీసీబస్టాండ్, గ్యారేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం, ప్రతిభతో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్లకు నగదు బహుమతులిచ్చారు. బహుమతులందుకున్న వారిలో కరిముల్లా, జనార్దన్, మల్లికార్జున్‌రెడ్డి, రసూల్ అహ్మద్‌లు ఉన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వైయస్సార్ ఆశయ సాధనకు కృషిచేద్దాం!

## రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు అపారమని, ఆయన ఆశయసాధన దిశగా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులమంతా కృషిచేద్దామని వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని తమ నివాసంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను ఈనెల 8న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునే దిశగా దేశంలోనే తొలిసారిగా పెద్దఎత్తున పాదయాత్రకు శ్రీకారం చుట్టిన నేత డా.వైఎస్ఆర్ అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా జనరంజక పాలన అందించిన ఘనత ఆయనదేనన్నారు. తొలుత డా. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ బాలయ్య, మాజీ కౌన్సిలర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



2019లో గూడూరు సబ్‌కలెక్టర్‌గా, ఎలక్షన్ రిటర్నింగ్ అధికారిగా పనిచేసి ప్రస్తుతం నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఓ.ఆనంద్‌ను ఈ నెల 8వ తేదీ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి, పూలమొక్కను బహుకరించిన జిల్లా మాజీ విజిలన్స్ మరియు మానిటరింగ్ కమిటీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు అరవ పార్వతయ్య తదితరులు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ఎక్కడైనా నిర్లక్ష్యంవహిస్తే.. సహించే ప్రసక్తే లేదని, గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు మళ్లీ పునరావృతం చేస్తే చర్యలు తప్పవని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంతంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారాల వేదికను నిర్వహించి, సమస్యలపై అర్జీలను అందుకున్నారు. గూడూరు పట్టణం, మండలంతో పాటు, చిల్లకూరు మండలం నుంచి అనేకమంది తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి వినతులు అందించారు. అనంతరం ఆర్డీవో కిరణ్‌కుమార్‌తో కలసి అధికారులతో సమీక్షించారు.

# రోటరీ క్లబ్ అన్నదానం



గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని గమళ్ళపాలెంలో వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగవెంకట శివకుమార్ దాతృత్వంతో వృద్ధులకు ఛాయిస్‌ఫుడ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి, వారు కోరుకున్న భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు దశరథ రామిరెడ్డి, కె.మునిగిరీష్, మయూరి శ్యాం యాదవ్, పి.వి.కృష్ణయ్య, రాంప్రసాద్, మల్లయ్య, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆశయాలు నెరవేరుస్తాం!

## - ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఆశయాలు నెరవేర్చుతూ వైసీపీ శ్రేణులు ఆయన చూపిన మార్గంలో నడుస్తారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. డా.వై.యస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని బనిహీసాహెబ్‌పేట ప్రాంతంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ మురళీధర్, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డిలు పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# నవీన విజ్ఞాన పథాన నవ్య కాలదీపిక.. 'ది రేషనల్ సోలార్ క్యాలెండర్'

మనిషి జడమయ జీవితాన్ని తట్టిలేపి, వెలుగునిచ్చే బంగారు పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. వాటిలోని అక్షరాలు సూర్యోదయాలు. అవి మూఢ చీకట్లను పారదోలే కాంతి పుంజాలు. ఆ కోవకి చెందిన అద్భుతమైన గ్రంథాల్లో.. మన నెల్లూరీయులు.. విఆర్‌సి విశ్రాంత ఫిజిక్స్ ప్రొఫెసర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డి రచించిన 'ది రేషనల్ సోలార్ క్యాలెండర్' అనే ఆంగ్లగ్రంథం ఒకటి. ఇది 170 పేజీల పుస్తకం. లక్ష్యాన్ని ఛేదించే బాణం లాగా తన సమస్త చైతన్యాన్ని ఒక విషయంపై కేంద్రీకరించి, అనుకున్నది సాధించేవాడే శాస్త్రజ్ఞుడు. మట్టినే నమ్ముకొని జీవనం సాగించిన ఓ రైతు కుటుంబం నుంచి వచ్చినవాడు మల్లికార్జునరెడ్డి. శాస్త్రంలోని మెలకువల్ని ఆకళింపు చేసుకున్న ఓ రకమైన శాస్త్రజ్ఞుడు ఈ రచయిత. చిన్నతనంలో తమ మాస్టారు క్యాలెండర్ రూపాంతరం, నెలలో తేదీల మార్పు, శుభకార్యాలకు సంప్రదించే పద్ధతిని గురించి ముచ్చటించడం ద్వారా ఆకర్షితుడై, అప్పట్లోనే సరళమైన క్యాలెండర్‌ను రూపొందించాలన్న ఆలోచన ఆయన మనసులో నాటుకుంది. అది ఇంతకాలానికి సాకారమైంది.

మానవజాతి నిర్మించుకున్న వైజ్ఞానిక సోపాన పథంలోని తొలిమెట్లలో క్యాలెండర్ ఒకటి అంటారు ఓ శాస్త్రవేత్త. ఒకప్పుడు ప్రపంచ దేశాలు క్యాలెండర్‌ను రూపొందించాలని పోటీపడ్డాయి. వాటిలో బాబిలోనియన్, ఈజిప్షియన్స్, రోమన్, జూలియన్, గ్రిగోరియన్, హిబ్రు, బౌద్ధవులు, హిజ్రి, చైనీయులు.. ఈ పోటీలో ఎవరెవరి క్యాలెండర్లు వారు తయారు చేశారు. "ప్రయోజన మనుద్దిశ్యనమందోపి ప్రవర్తితే" అన్నట్లుగా, ఏ ప్రయత్నమైనా మనిషి ఆలోచించి చేస్తాడు. అలా ఎంతగానో ఆలోచించి మల్లికార్జునరెడ్డి ఈ గ్రంథంలో అనేక ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు. ఎంతో సులువుగా ఒక నెలలోని తేదీలు, వారాల అమరిక గుర్తుంచుకుంటే, ఏ నెలలో, ఏ తేదీన, ఏ వారం వస్తుందో అట్లే చెప్పవచ్చునంటారు. సరళమైన క్యాలెండర్‌ను రూపొందించాలన్న సమస్యను సవాలుగా తీసుకొని విజయాన్ని సొంతం చేసుకోవడం రచయిత కృషికి, పట్టుదలకు నిదర్శనం.

ప్రకృతికి, మానవ జీవనానికి ఎంతో ముడిపడి ఉంది. ప్రకృతిలోని మార్పులు గ్రహాల కదలికల వల్ల సంభవిస్తాయి. కాలంలో మార్పులు వీటివల్ల కలుగుతాయి. కాలాన్ని లేక ప్రకృతిలోని మార్పులను గణించే ప్రయత్నాలు ఏనాడో మొదలయ్యాయి. ఆ ప్రయత్నాలు ఓ రూపును సంతరించుకొని క్యాలెండర్‌గా ఆవిర్భవించాయి. ముఖ్యమైన ఖగోళ విహారులు సూర్యచంద్రులు. ఆ కదలికల్ని కూలంకషంగా అధ్యయనం చేసి ఋతువులను నిర్ణయించారు. దీని ఫలితంగా సౌర, చంద్రమానాలు వెలుగులోకొచ్చాయి. రచయిత విభిన్న దేశాలు, ప్రాంతాల్లో ప్రసిద్ధిగాంచిన క్యాలెండర్ల సారాంశాన్ని, వడబోసి, సరళమైన, సహేతుకమైన, శాస్త్రీయ అంతర నిర్మాణం కలిగివున్న, ఖగోళ, గణిత శాస్త్రాలతో ముడిపడి ఉన్న గ్రంథాన్ని రూపొందించి "ది రేషనల్ సోలార్ క్యాలెండర్"(టిఆర్‌ఎస్‌సి)గా నామకరణం చేసి, మనందరి ముందుంచారు.

టిఆర్‌ఎస్‌సిని క్లుప్తంగా తార్కిక (అకరణీయ) సౌర క్యాలెండర్‌గా పేర్కొనవచ్చు. మునుపటి క్యాలెండర్లన్నీ, సౌర, చంద్రమానాల ఆధారంగా రూపొందాయి. ఈ టిఆర్‌ఎస్‌సిలో సూర్యుడిని ప్రామాణికంగా తీసుకోబడింది. పలు మత గ్రంథాలలో పేర్కొన్న, వాడుకలో ఉన్న క్యాలెండర్ల విశిష్టతను ఆకళింపుచేసుకొని, శాస్త్రీయబద్ధమైన క్యాలెండర్‌ను తయారుచేశారు రచయిత. ఈ శ్రమలో




**ది రేషనల్ సోలార్ క్యాలెండర్**
రచయిత:
**పచ్చిపాల మల్లికార్జునరెడ్డి**
సెల్: 9490809832
పేజీలు : 170 వెల : రూ. 789/-
ప్రతులు : అమెజాన్‌లో లభించును

ఎంతో అనుభవం ఉన్న వ్యక్తుల్ని కలసి, చర్చించి, లోపాలు లేకుండా క్యాలెండర్‌ను తయారు చేయడం విశేషం. ఈ క్యాలెండర్‌ను రూపొందించడం అందరి చేతకాదు. దీని వెనకాల ఎంతో కఠినమైన శ్రమ దాగుందని, ఈ పుస్తకం చదివితే తెలుస్తుంది. ఈ పుస్తకంలోని విశిష్టత ఏమిటంటే, సంవత్సరంలోని అన్ని మాసాలలో తేదీలు, వారాల మధ్య సంబంధం ఒకే రీతిలో ఉంటుంది. ఈ కూర్పును సాధించడంలో రచయిత కృతకృత్యుడయ్యాడు. నేడు ప్రతి వ్యక్తి ఏదో కారణంతో క్యాలెండర్‌ను వాడాల్సి వస్తుంది. అయితే, ప్రతి కొత్త సంవత్సరంలో కొన్ని కోట్ల క్యాలెండర్‌లను ముద్రించడంతో డబ్బు వృధా అవుతోంది. ఒక్కసారి ఈ రచయిత తయారు చేసిన క్యాలెండర్‌ను ముద్రిస్తే, అసలు వేరే క్యాలెండర్లను అచ్చు వేయనవసరం లేదు. కొననవసరం లేదు. టిఆర్‌ఎస్‌సి యొక్క ఒక నెలలోని తేదీలు, వారాల అమరికను గుర్తుపెట్టుకుంటే చాలు, ఇక జీవితాంతం కళ్ళుమూసుకొని కూడా ఏ సంవత్సరంలో, ఏ నెలలో, ఏ తేదీన ఏ వారం వస్తుందో చెప్పగలం. రచయిత అవిరళ కృషి ఫలితంగా ఈ క్యాలెండర్ రూపుదిద్దుకుంది. సమాజంలోని ప్రతిఒక్కరూ ఈ దిశగా ఆలోచించి టిఆర్‌ఎస్‌సిని వాడాలి. ఇక, అప్పటినుంచి ప్రతి సంవత్సరం కొత్తగా క్యాలెండర్‌ను రూపొందించాల్సిన పని ఉండదు. కొత్త సంవత్సరం క్యాలెండర్ పేపర్‌కు ఎన్నో చెట్లను నరికే పని ఉండదు. ప్రకృతిని ఈ విధంగా పరిరక్షించుకోవచ్చు.

మనిషి ఉన్నతంగా ఎదగటానికి తనకో ప్రపంచం కావాలి. తాను ఉన్నతంగా ఎదిగాక, ఈ ప్రపంచానికి తను కావాలి. ఇలాంటి రచయితలు సమాజానికి కావాలి. ఒక పుస్తకాన్ని విశ్లేషించడమంటే, ఎంతో సాహసంతో కూడుకున్న పనిగా నాకు తెలియవచ్చింది. సమాజాభివృద్ధి పట్ల గురుతరమైన బాధ్యతను గుర్తెరిగి, రచనలు చేసే వారే నిజమైన రచయితలు. క్యాలెండర్ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చిన మల్లికార్జునరెడ్డికి శుభాకాంక్షలు. ఆ శాస్త్రజ్ఞుని సాహసానికి అభినందనలు.



సమీక్షకులు :
**ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డి**
సెల్ : 9440432464

# సామాజిక మాధ్యమాల్లో చీడపురుగులు!

సామాజిక మాధ్యమాల్లో కొంతమంది పోకడ రోత పుట్టిస్తోంది. వ్యూస్‌లని, లైక్‌లని పెంచుకోవడమే ధ్యేయంగా ఒక వర్గం నెటిజన్లు మాట్లాడుతున్న వెకిలి మాటలు, చేస్తున్న వెకిలి చేష్టలతో ఆ వ్యవస్థే కలుషితమవుతోంది. తాజాగా జరిగిన ఒక సంఘటన సామాజిక మాధ్యమాలలో అలాంటి చీడ పురుగుల విపరీత ధోరణికి సాక్ష్యంగా నిలిచింది. ఇటీవల ప్రణీత్ హనుమంతు అనే ఒక తెలుగు యూట్యూబర్ డార్క్ కామెడీ పేరుతో చేసిన వీడియో ఒకటి మానవ సంబంధాలను అపహాస్యం చేసేలా, సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉంది. ఎవరో విదేశీయులు చేసిన ఒక రీలుపై బూతు వ్యాఖ్యలు చేస్తూ ఆ వీడియో కొనసాగింది. ఆ రీలులో నడివయస్సు పురుషుడు, ఒక చిన్నారి కనిపిస్తారు. వాళ్లిద్దరూ తండ్రీ, కూతుళ్లు అని స్పష్టంగా అర్థమయ్యేలా ఆ వీడియో వుంది. ఎలాంటి అసభ్యకరమైన పదజాలం లేని ఆ వీడియోని తండ్రీ కూతుళ్ళ సంబంధానికి బూతు అర్థాలు తీసేలా వెకిలి జోకులతో, అసభ్యకరమైన మాటలతో ఆ తెలుగు యూట్యూబర్ ఆ వీడియోని రూపొందించాడు. ఇప్పుడది రెండు తెలుగురాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైగా ఆ యూట్యూబర్ ఒక ఐఏఎస్ అధికారి కుమారుడు. దీనిపై మెగా సోదరుల మేనల్లుడు, సినీహీరో సాయిధరమ్ తేజ్ ఎంతో ఆవేదనతో ఎక్స్‌లో స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో కొంతమంది అమానవీయంగా ప్రవర్తిస్తుంటారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. మరో హీరో మంచు మనోజ్, మరి కొంతమంది సినిమా నటులు కూడా యూట్యూబర్ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్లు చేశారు.

సాయిధరమ్ తేజ్ తన పోస్టును తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులకు ట్యాగ్ చేశారు. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ నిందితులపై చర్య తీసుకుంటామని చెప్పారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలంగాణ డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈనెల 10, బుధవారం ప్రధాన నిందితుడైన ప్రణీత్‌హనుమంతును పోలీసులు బెంగుళూరులో అరెస్టుచేసి హైదరాబాదుకు తరలించారు కూడా.

## ఎందుకీ వైపరీత్యం?

సోషల్ మీడియా ఒక మహాసముద్రం. అందులో పెట్టే కంటెంట్‌కు ప్రజాదరణ బాగా ఉంటే దాని ఆధారంగా ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ డబ్బు సంపాదించుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు యూట్యూబ్లో నిర్దిష్ట గంటలు, నిర్దిష్ట వ్యూయర్‌షిప్ దాటితే యూట్యూబ్ నుంచే నేరుగా డబ్బు అందుతుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అయితే వ్యూయర్‌షిప్ పెంచుకుంటే ఇన్ఫ్లూయెన్సర్‌గా పేరు వస్తుంది. వారు ఎవరి ఉత్పత్తిని అయినా, సేవలను అయినా తన రీల్స్‌లో ప్రమోట్‌చేస్తూ వారి వద్ద డబ్బులు తీసుకుంటారు. అంటే సోషల్ మీడియాలో ఎవరి కంటెంట్‌కు వ్యూయర్‌షిప్, లైకులు ఎక్కువగా ఉంటే వారికి సంపాదన అవకా శాలు ఎక్కువగా ఉంటాయన్న మాట. దీంతో ఎలాగైనా ఎక్కువ మంది వీక్షకులను ఆకట్టుకోవాలనే లక్ష్యంతో ఎటువంటి కంటెంట్ పెట్టడానికైనా కొంతమంది సిద్ధపడుతున్నారు. రోస్టింగ్ పేరుతో చవకబారు హాస్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి రోస్టింగ్ ఛానల్స్‌లో కడుపుబ్బా నవ్వించే మంచి హాస్య వీడియోలు కూడా ఉంటాయి. సమాజంలోని కొన్ని సమస్యలను, కొన్ని వాస్తవ పరిస్థితులను ఉటంకిస్తూ వారు తమ వ్యాఖ్యలతో, పోలికలతో నవ్వించే సంభాషణలతో, గిలిగింతలు పెట్టె చర్యలతో వీడియోలు చేస్తుంటారు. కొంతమంది ప్రముఖులను కూడా అనుకరిస్తుంటారు, కానీ వ్యక్తిగత అంశాల జోలికిపోకుండా తమ హద్దుల్లోనే హాస్యాన్ని పండిస్తారు. కానీ కొంతమంది మాత్రం రోస్టింగ్ పేరుతో డార్క్ కామెడీని ప్రదర్శిస్తున్నారు. అంటే నీచమైన, అసభ్యకరమైన, జుగుప్సాకరమైన వ్యాఖ్యలతో, చర్యలతో వీడియోలు చేస్తున్నారు. వాటిని కూడా ఆదరించే ప్రేక్షకులుండడం మన దౌర్భాగ్యం.

మరికొంతమంది ముందే తయారు చేసుకున్న స్క్రిప్ట్ ప్రకారం వీడియోలు చేస్తూ వాటిల్లో నాటకీయత చొప్పించడం ద్వారా ఎక్కువమందిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఉదాహరణకు ఒక పేద పిల్లవాడిని ఏదైనా దుకాణానికి తీసుకెళ్లి బట్టలు కొనడం, పిజ్జా తినిపించడం వంటి వీడియోలు చేస్తూ తమకు గొప్ప సేవా గుణం ఉందన్న భావం కలిగేలా చేస్తుంటారు. దీంతో అటువంటి వారు సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తులుగా మారతారు. దీంతో వారు ఏ వస్తువును, ఏ సేవను ప్రమోట్ చేసినా నమ్మే పరిస్థితి వస్తుంది. కొన్ని సందర్భాల్లో చట్ట విరుద్ధమైన, అనైతికమైన సేవలను కూడా వారు ప్రమోట్ చేస్తుంటారు.

మరి సోషల్ మీడియా నిర్వాహకులకు నియంత్రణ లేదా అన్న ప్రశ్న కూడా ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తోంది. సోషల్ మీడియా మహాసముద్రం లాంటిది. ఏది మంచి... ఏది చెడు..? అని జల్లెడపట్టడం అసాధ్యమైన పని. అభ్యంతరకరమైన విషయాల గురించి వివరిస్తూ వాటి నిర్వాహకులు మార్గదర్శకాలు కూడా ఇస్తుంటారు. హద్దు దాటితే బ్లాక్ చేస్తామని హెచ్చరికలు కూడా చేస్తుంటారు. బ్లాక్ చేస్తుంటారు కూడా.



## పరిష్కారం లేదా?

చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం ఒక పరిష్కారం కాగా, పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు హితబోధ చేయడం, ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణ అలవడేలా చేయడం మరో మార్గం. నిజానికి రెండో మార్గం వల్ల దీర్ఘకాలికంగా సత్ఫలితాలుంటాయి. పిల్లలు సోషల్ మీడియాకు బానిసలుగా మారిపోతున్నారు. తల్లిదండ్రులు వారి వ్యాపకాల్లో తీరిక లేకుండా ఉండడం వల్ల స్మార్ట్‌ఫోన్ పిల్లల చేతిలో ఎక్కువసేపు ఉంటోంది. తొలుత దీన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. వీలయినంత సేపు తల్లిదండ్రులు వారితో గడపడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో చుట్టాలు, స్నేహితుల కుటుంబాలతో గడిపే అవకాశాలు కల్పించడం, ఆటపాటల వంటి వ్యాపకాల్లో చేర్పించడం, వారికిష్టమైన అభిరుచులు కనుక్కొని వాటిలో మమేకమయ్యేలా చూడడం వల్ల వారిని సోషల్ మీడియాకు దూరంగాపెట్టొచ్చు. ఇక చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరో పరిష్కారం. ఇలాంటివి వెలుగులోకి వచ్చినప్పుడు నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, వాటిని ప్రజలందరికీ బాగా తెలిసేలా ప్రాచుర్యం కల్పిస్తే అనైతిక కంటెంట్ పెట్టాలన్న ఆలోచన ఉన్నవారిలో భయం మొదలవుతుంది. సమాజానికి అవగాహన కల్పించే పని కోసం సెలబ్రిటీలు ముందుకు రావాలి. వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది కాబట్టి వెంటనే ప్రభావం కనిపిస్తుంది. సాయిధరమ్ తేజ్, మంచు మనోజ్ వంటి వారు చేసింది చాలా మంచి పని. ఇటువంటి విజిల్ బ్లోయర్స్ మరింత మంది పెరగాలి. మన సమాజం అమానవీయ సంస్కృతితో కలుషితం కాకుండా మనమే కాపాడుకోవాలి. వ్యవస్థల్ని భ్రష్టుపట్టిస్తున్న ప్రణీత్ హనుమంతు లాంటి చీడ పురుగులని సమాజం నుండి వెలివేయడం మనందరి సామాజిక బాధ్యత.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**

---



## జానకిరామ.. రామాయణం 21

- ఊటుకూరు జానకి రామారావు

మంథర మాటల ప్రభావం తీవ్రంగా పనిచేస్తుంది! కైక మీద. ఆమె అంతరంగంలో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

రాముడు రాజైతే? ఆ ఊహే భరింపశక్యం కాకుండా ఉంది! తన కొడుకు అడవులపట్టి పోవాల్సిందే! తాను కౌసల్యకు దాస్యం చేయాల్సిందే! కౌసల్యను తాను ఎంత చిన్నచూపు చూసిందో! ఇప్పుడు అంతకు అంత అనుభవించాలి. ఇంత బ్రతుకు బ్రతికి ఇప్పుడు ఈ విధంగా! ఆ తలపు తట్టుకోలేకపోతుంది. జరగబోయే అవమానాలు తలచుకొని ఆమె గుండె చెదిరింది. తన ఉనికి ప్రశ్నార్థకంగా మారబోతుంది.

ఇన్ని ఆలోచనలు ఆమె మానసాన్ని నిలువునా దహించి వేస్తున్నాయి!

చీకటి ఆవరించి నక్షత్రాలు లేని ఆకాశం వలే ఉంది ఆమె అంతరంగం!

ఉవ్వెత్తున లేస్తున్న ఆలోచనలు ఆవిడను కుదురుగా ఉండనీయటం లేదు! నేల మీదపడి దొర్లుతుంది కైక!.

పగపట్టిన పాములాగ బుసలుకొడుతుంది, రుసరుసలాడుతుంది, వేడివేడి నిట్టూర్పు సెగలు ఆవిడ శరీరాన్ని కాల్చివేస్తున్నాయి!.

రాముడి అభిషేక వార్త బయట అందరికీ తెలిసిపోయింది.

కైకకు తానుగా చెప్పకపోతే బాగుండదన్న ఉద్దేశంతో ఆమెకు తెలియచేయాలని అంతఃపుర ప్రవేశం చేశాడు దశరథమహారాజు.

ఆశ్చర్యకరంగా అక్కడ కైక లేదు! తాను వచ్చే సమయానికి సర్వాంగ సుందరంగా అలంకరించుకొని తీయగా తనను పలుకరించే ఇల్లాలు అక్కడలేదు, ఆవిడ పెంపుడు చిలుకలు ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాయి! కైకలేని ఆ ఇల్లు చంద్రుడు, నక్షత్రాలు లేని ఆకాశంలా ఉంది.

ఎక్కడికి వెళ్ళింది కైక? పరిచారికలను అడిగాడు దశరథుడు.

వారు భయంభయంగా అత్యంత వినయవిధేయతలతో "మహారాజా కైకమ్మ తీవ్రమైన కోపంతో కోపగృహంలోనికి వెళ్ళారు" అని తెలియజేశారు.

ఆవిడ కనపడనందుకే ఆయన మనస్సును విచారం ఆవరించింది, ఇప్పుడు ఆవిడ కోపగృహప్రవేశం ఆయన మనస్సును విషాదంతో నింపింది!

ఆవిడ ఉన్నచోటుకు మెల్లగా వెళ్ళాడా వృద్ధ నరపతి!

అక్కడ పెరికివేసిన లతలా! బంధింపబడిన లేడిలా! క్రిందకు పడిపోయిన దేవకాంతలాగ, తన ప్రాణేశ్వరి, యువతి అయిన కైక మూర్తీభవించిన శోకదేవతలా శోభావిహీనంగా కనపడ్డది.

ఆ స్థితిలో ఆవిడను చూసిన ఆయన మనస్సు వణికిపోయింది, తాను కూడా క్రింద చతికిలబడి మృదువుగా ఆవిడ చేయి తన చేతిలోనికి తీసుకొని మెల్లగా నిమురుతూ, ఏమి కష్టం వచ్చింది దేవీ నీకు? ఆరోగ్యం సరిగాలేదా! ఇప్పుడే రాజవైద్యులను పిలిపిస్తాను.

నీవు ఎవరికైనా ప్రియం చేకూర్చదలిస్తే చెప్పు! ఇప్పుడే తీరుస్తాను. నీకెవరైనా అపకారం తలపెట్టారా చెప్పు! తక్షణమే దండిస్తాను.

నీకన్నా నాకు ప్రియమైనది ఏదీలేదు! నేను నీవాడిని! నీ ఆజ్ఞానువర్తిని. ప్రాణాలు ఫణంగాపెట్టి అయినా నీ అభీష్టం నెరవేరుస్తాను. నా పుణ్యం మీద ఒట్టువేసి చెపుతున్నాను అంటూ పరిపరి విధాలుగా ప్రాధేయపడ్డాడు దశరథమహారాజు.

దశరథుడు బ్రతిమాలుతున్న కొద్దీ బెట్టు చేయడం ఎక్కువ అయ్యింది కైకకు! ఆవిడ ఆయనకు ప్రియసతి! ఆవిడ మనసుకు కొంచెం కష్టం కలిగినా సహించి భరించలేడు ఆ రాజు!

మెల్లగా ఆవిడ కేశాలు తన చేతిలోకి తీసుకుని కైకా! నీ కన్నా రాముడికన్నా! ప్రియమైన వారు ఎవరున్నారు నాకు ఈ లోకంలో!

నా రాముడి మీద ఒట్టువేసి చెపుతున్నాను నీకేమి కావాలో చెప్పు, క్షణంలో తీరుస్తాను!.

నామీద నీకు ఎంత అధికారముందో నీకు తెలుసు, నేను చేసిన పుణ్యం మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను నీ కోరిక చెల్లిస్తాను!.

ఇన్ని రకాలుగా హామీలు తీసుకున్న తరువాత కైక తన మనసులో గల కోరిక వెల్లడించడానికి ఉద్యుక్తురాలయ్యింది! హఠాత్తుగా వచ్చిపడిన మృత్యువులాగ ఆవిడ నోట మాట బయల్పడింది!

పంచభూతాలు, సూర్యచంద్రులు, గంధర్వులు, దేవతలు అందరూ కూడా నీవు పెట్టిన ఒట్లు విన్నారు! మహారాజా నీవు నాకు మునుపు ఇచ్చిన రెండు వరాలు ఇప్పుడు కోరుకోదలచుకొన్నాను. వాటిని సత్యసంధుడవైన నీవు ఇప్పుడు చెల్లించవలెను. లేని పక్షంలో నా ప్రాణాలు విడువగలదానను అని పలికింది... అవి..

దశరథుడు కామంతో కప్పబడిన మనస్సుకలవాడై, పాశంలో చిక్కిన లేడిలాగ అయిపోయాడు.

రాముని అభిషిక్తుని చేసేందుకు నీవు సకల సంభారాలు సమకూర్చుకున్నావు కదా! వాటితో రాముని బదులుగా భరతుని అభిషేకించు!



రెండవ వరం... రాముడు పదునాల్గు సంవత్సరాలు నారచీరలు, మృగాజినము, జటలు ధరించి దండకారణ్యంలో ముని వృత్తి నవలంభిస్తూ.. నివసించాలి.

ఏ శత్రుబాధ లేని రాజ్యం భరతునకు లభించుగాక!.

కైక మాటలు పుట్టించిన శబ్దప్రకంపనలు దశరథమహారాజు హృదయకవాటాన్ని ఛేదిస్తున్నాయి.

ఆ శబ్దాలను మోసుకొచ్చిన గాలి కూడా ఆయనకు అప్రియంగా తోచింది. కొంతసేపు శ్వాసించటం ఆగిపోయింది.

నిశ్చేష్టుడైపోయాడు! నీరసం ఆవహించింది ఆయన శరీరాన్నంతా! అప్పటిదాకా ఆమె చుట్టూ అల్లుకొన్న మోహభావనలు టపటప తెగిపోయాయి. ఆమె అంటే ఉన్న అంతులేని కామభావన అసహ్యం, జుగుప్సగా రూపాంతరం చెందింది.

మొదలు నరికిన చెట్టులాగ కూలబడిపోయాడు! ఛీ!ఛీ! అని ఛీత్కారాలు చేసుకుంటూ స్మృహతప్పిపోయాడు. మంత్రప్రభావానికి కట్టుబడ్డ మహానాగు కొట్టే బుసలలాగ విడుస్తున్నాడు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

చాలాసేపటికి కొంత తేరుకున్నాడాయన, నేత్రాలు అరుణిమ దాల్చాయి, కన్నుల నుండి నిప్పుకణాల ప్రవాహంలాగ ఆయన చూపులు కైకను కాల్చివేసేటట్లుగా ఉన్నాయి.

చాలా తీవ్రంగా దూషించాడు కైకను! ఓసీ దుష్టురాలా, పాపాత్మురాలా సర్వప్రాణికోటి హితంకోరే రాముడు నీకేం అపకారం చేశాడే? నేనేమి ద్రోహం చేశానే నీకు!

నిన్ను కన్నతల్లిలాగ చూసుకుంటున్నాడు కదనే వాడు! వాడికే అనర్థం తలపెడతావా! నీవు, ఓసి పాతకీ!

నీవు రాజకుమారివని తలచి తెచ్చుకొన్నానే కానీ, లోకాలన్నీ దహించివేసే మహాభయంకర విషనాగువని అప్పుడు నాకు తెలియదే!.

.. (సశేషం)



## 'నమస్కార్ శ్రీధర్'.. నెల్లూరీయుడికి ప్రధాని పలకరింపు

ఇటీవల ఢిల్లీలోని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నివాసానికి వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోడీకి తమ కుటుంబ అభిమాని పోతుగుంట శ్రీధర్‌నాయుడుని వెంకయ్య పరిచయం చేశారు. ఈ సందర్భంగా 'నమస్కార్ శ్రీధర్' అంటూ ప్రధాని ఆప్యాయంగా పలుకరించారు. నెల్లూరుజిల్లా పొదలకూరు మండలం, ఎలికంటిపాళెం శ్రీధర్ స్వగ్రామం. ఆయన తండ్రి వెంకటరమణయ్య నాయుడు రైల్వే కాంట్రాక్టర్‌గా ప్రసిద్ధి. పి.వెంకటరమణయ్య ఇంజనీర్స్ & కాంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (PVRE & CPL) సంస్థ గత 40 సంవత్సరాలుగా రైల్వే కాంట్రాక్టర్స్‌గా మహారాష్ట్రలో ప్రతిష్టాత్మకమైన పనులను చేపట్టి సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. శ్రీధర్, రమణయ్యనాయుడి ఆఖరి కుమారుడు.

## సమస్యలు విన్నారు..
# వెంటనే పరిష్కరించారు

- ఎమ్మెల్యే అంటే ఏమిటో, ఎలా ఉండాలో నిరూపించుకున్నారు
- ప్రశాంతిరెడ్డి చొరవకు విద్యార్థుల తల్లితండ్రుల్లో సంతోషం



**అక్కడి అయ్యవార్లేమో హిందీలో మాట్లాడతారు. స్కూల్లో ఉండేదంతా తెలుగు పిల్లలు. వాళ్ళుచెప్పేది వీళ్లకు, వీళ్ళ బాధలు వాళ్లకు తెలిసే పరిస్థితి లేదు. చివరికి తమకు పెట్టే అన్నం బాగా లేదని చెప్పినా అయ్యవార్లకు అర్ధం కాదు. దీంతో గత కొంతకాలంగా ఆ విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఎట్టకేలకు ఆ సమస్య కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి రావడం, ఆమె వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో అప్పటికప్పుడు చర్చించి సమస్యను పరిష్కరించడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఆ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేవు. ఎమ్మెల్యే అంటే ఏమిటో ఎలా ఉండాలో ప్రశాంతిరెడ్డి నిరూపించుకున్నారంటూ తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.**



కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (గురుకుల పాఠశాల)కు చెందిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అంతా ఉత్తరభారతదేశం నుంచి వచ్చినవారు కావడంతో, వారికి తెలుగు సరిగా అర్ధం కాదు. కేంద్రప్రభుత్వం గురుకుల పాఠశాలలను తమ పరిధిలోకి తీసుకోవడంతో ఇక్కడ హిందీ టీచర్లను నియమించారు. అయితే, పిల్లలకు హిందీ రాదు. అయ్యవార్లు హిందీలో చెప్పే పాఠాలు పిల్లలకు అర్ధం కావు. ఇంగ్లీషు టీచర్లున్నా వారు చెప్పేది, వీరికి అర్ధమయ్యేది అంతంత మాత్రమే. అందుకు తగ్గట్టుగా అక్కడ అన్నం కూడా సరిగా పెట్టేవారు కాదు. ఎప్పుడూ రసమన్నం తప్ప మరేమీ ఉండేది కాదు. వార్డెన్‌ను అన్నం అడిగితే, రసం తాగి పడు కోండని చెప్తారని విద్యార్థులు బాధ పడుతుండేవారు. రాత్రివేళల్లో అసలు అన్నం పెట్టేవారే కాదు. ఈ పరిస్థితుల్లో తమకు టీసీలు ఇచ్చేస్తే మరెక్కడికైనా వెళ్ళిపోతామని చెప్తున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని పిల్లలంతా లబోదిబో మంటూ ఈనెల 10న రోడ్డెక్కారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు హడావిడిగా అక్కడికి వెళ్లారు. ఆ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెంటనే విద్యార్థుల సమస్యలేమిటో తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో సంప్రదించి ఆ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏకంగా ఏడుగురు తెలుగు ఉపాధ్యాయులను అప్పటికప్పుడు నియమించేలా చేసి, పిల్లలకు ఆనందం కలిగించారు. అంతేకాదు, పిల్లలకు పెట్టే భోజనంలో ఎలాంటి సమస్య ఉండకూడదని, భోజనం నాణ్యతలో రాజీపడకుండా విద్యార్థులంతా ఇష్టపడి తినే విధంగా అన్నం పెట్టాలని ఆమె నిర్వాహకులను ఆదేశించారు. పిల్లలకు సరిపడా భోజనం పెట్టాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యేగా ఆమె అప్పటికప్పుడు స్పందించి ఎమ్మెల్యే అంటే ఏమిటో, ప్రజల సమస్యల పట్ల ఎలా స్పందించాలో చెప్పకనే చెప్పారు. ఎంతోకాలం నుంచి పిల్లలకు ఉన్న పెద్ద సమస్యను గంటల వ్యవధిలోనే తీర్చారు.

తమ కష్టాలు తెలుసుకుని వెంటనే సమస్యను పరిష్కరించినందుకు ఆ విద్యార్థులు, తల్లితండ్రులంతా ప్రశాంతిరెడ్డిని మనసులోనే అభినందిస్తూ, తమ కృతజ్ఞతలు చెప్తున్నారు.

## 'అమ్మ పేరుతో ఒక మొక్క'.. కార్యక్రమం వాయిదా

నెల్లూరులోని కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 12వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగాల్సివున్న 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమాన్ని అనివార్యకారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నెల్లూరులోని కేంద్రప్రభుత్వ క్షేత్ర ప్రచారశాఖ కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ కార్యక్రమాన్ని మళ్ళీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

# తీగ లాగుతున్నారు!

(మొదటిపేజీ తరువాయి)

కనీసం పోస్టింగులు లభించక కొందరు, అప్రాధాన్యత స్థానాలలో పనిచేయలేక మరికొందరు, కేంద్ర సంస్థల నుండి డిప్యుటేషన్‌పై వచ్చి తిరిగి తమ మాతృ విభాగాలకి వెళ్ళలేక ఇంకొందరు లబోదిబోమంటున్నారు.

"సంపాదనకు కాదేదీ అనర్హం" అన్నట్లుగా గత అయిదేళ్ళ పాలనలో ఎవరికి దొరికింది వారు దోచుకున్నారు. అత్యధిక స్థాయిలో ఆదాయ మార్గాలున్న మద్యం, మైనింగ్ వంటి ప్రధాన రంగాలతో పాటు దేన్నీ చిన్నచూపు చూడలేదు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, రోడ్లు – భవనాలు, పంచాయతీరాజ్, వైద్యఆరోగ్య శాఖ, విద్యా శాఖ, మార్కెటింగ్ శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ చివరికి వీటన్నిటికీ నిధులు మంజూరుచేసే ఆర్ధిక శాఖని కూడా వదిలిపెట్టలేదు.

సాక్షాత్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి సాక్షిగా తిరుమల తిరుపతి దేవస్థానాలని కూడా తమ అవినీతి సంపాదనకి, అక్రమాలకి, అకృత్యాలకి వేదికగా మార్చుకున్నారు.

తహశీల్దార్ స్థాయి నుండి ప్రధాన కార్యదర్శి వరకూ, కానిస్టేబుల్ దగ్గర నుండి డీజీపీ స్థాయి వరకూ ఎవరు ఏం చేసినా తమకి తెలిసే చేయాలన్నట్లుగా సల(స్వా)హాదారుల అజమాయిషీ కొనసాగింది. అవతల ఉద్యోగి ఎంతటి స్థాయివాడైనా వాళ్ళే నేరుగా ఫోన్‌చేసి పనులు చక్కబెట్టుకునేవారని కొందరు క్రింది స్థాయి ఉద్యోగులు వాపోతున్నారు.

ముఖ్యమంత్రితో పాటు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కూర్చుని వీళ్లందరినీ తన కనుసైగలతో ఆడించిన కీలక అధికారి మాత్రం మే 31న పదవీ విరమణ చేసి వెళ్లిపోయారు. మళ్ళీ జగన్ ప్రభుత్వమే వచ్చి, తనకి మరో ఐదేళ్ళు దోచుకునే అవకాశం వస్తుందని ఆశపడ్డ ఆ కీలక అధికారి ఆశలు అడియాసలయ్యాయని కొత్త సీఎంఓ అధికారులు గుసగుసలాడుకుంటున్నారని సమాచారం. జూన్ 4న ఫలితాలు తారుమారయ్యే వరకు సదరు అధికారి తాడేపల్లి ప్యాలెస్‌లోని కుర్చీ కూడా ఖాళీ చేయలేదని భోగట్టా!.

### తీగలాగుతున్న కొత్త ప్రభుత్వం!

చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి కేవలం నెలరోజులు మాత్రమే అయ్యింది. ఈ నెలరోజులలోనే చాలామంది వినయ విధేయ అధికారుల భాగోతాలు బయటకి వస్తున్నాయి. కొంతమంది తమ మాతృసంస్థలకి తిరిగి వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తుంటే, మరికొందరు స్వచ్ఛంధ పదవీ విరమణ చేసి వెళ్లిపోతున్నారు. గత ప్రభుత్వంలో అవినీతి విక్రమార్కులుగా పేరు గడించిన అక్రమార్కుల పనిపట్టడానికి సిఐడి, విజిలెన్స్ విభాగాలని బాబు ప్రభుత్వం అస్త్రాలుగా వాడుతోంది. ఒక్కొక్కరి భాగోతాలని సాక్ష్యాధారాలతో బయటపెడుతోంది. ఇప్పటికే పలు శాఖల గతాధిపతుల గుట్టు రట్టు చేసింది. తీగలాగి డొంకని కదిలిస్తోంది. తాజాగా సమాచార పౌర సంబంధాల శాఖల పూర్వ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి, టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డిలపైన విజిలెన్స్ విచారణకి ఆదేశించింది.

### 'దురాచార శాఖ'గా అవతరించిన సమాచార శాఖ!



ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధిగా, మీడియా విభాగానికి సారధిగా పనిచేసే అత్యంత కీలకమైన శాఖ సమాచార పౌరసంబంధాల శాఖ. అటువంటి ముఖ్యమైన శాఖకి కమిషనర్‌గా తుమ్మా విజయకుమార్‌రెడ్డిని జగన్ ప్రభుత్వం 2019 జూన్ 2వ తేదీన నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇండియన్ ఇన్ఫర్మేషన్ విభాగం అధికారిగా కేంద్ర సర్వీసులో ఉన్న విజయకుమార్ అప్పటికి హైదరాబాదులో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్నారు. జగన్ అధికార పగ్గాలు చేపట్టిన మూడు రోజులకే విజయకుమార్ నియామకానికి ఆదేశాలిచ్చి, కేంద్ర సర్వీసులనుండి ఆయనని రప్పించి సమాచార శాఖాధిపతిగా కూర్చోబెట్టారు.

ఏకంగా ముఖ్యమంత్రి, ఆయన ప్రధాన సల(స్వా)హాదారుడి ఆశీస్సులతో వచ్చి కమిషనర్ స్థానంలో కూర్చున్న విజయకుమార్‌రెడ్డి సమాచార శాఖని దురాచార శాఖగా తయారు చేశారు. తన ఇష్టారాజ్యంగా విధి విధానాలని మార్చేశారు. జగన్ మీడియా తప్ప రాష్ట్రంలో మరొకరు మనుగడ సాగించకూడదన్నట్లుగా వ్యవహరించారు. చిన్న పత్రికలని ఉక్కుపాదంతో తొక్కేశారు. అక్రిడిటేషన్ల మంజూరు విధానంలో కొత్త నిబంధనలు విధించి వాటి సంఖ్యని గణనీయంగా తగ్గించేశారు. అపరిపక్వ నిర్ణయాలతో సమాచార రంగాన్ని అతలాకుతలం చేశారు. చివరికి రాష్ట్రప్రభుత్వం నెలకొల్పిన వైఎస్సార్ అవార్డులను సైతం అమ్మకానికి పెట్టారు. అనర్హులకి, అల్పులకి వాటిని కట్టబెట్టారు. జగన్ మీడియాలో పనిచేసేవారికి అగ్రతాంబూలం ఇచ్చేలా వాటిని ఎంపిక చేశారు. ఒక శాఖ పెత్తనం చేతిలోపెడితే ఎన్ని రకాలుగా ఆ శాఖని తన స్వార్ధం కోసం, తన బాసుల స్వప్రయోజనం కోసం దిగజార్చవచ్చో అన్ని రకాలుగా సమాచార శాఖని దురాచార శాఖగా మార్చారు. చేసిన తప్పులని తప్పించుకునే క్రమంలో తిరిగి మాతృశాఖకి వెళ్ళడానికి ప్రయత్నించి విఫలమై ఇప్పుడు విజిలెన్సు విచారణని ఎదుర్కొంటున్నారు.

### టీటీడీని.. తన అక్రమాలకి అడ్డాగా మార్చుకున్న (అ)ధర్మారెడ్డి!



అత్యంత పవిత్రత కలిగిన తిరుమల తిరుపతి దేవస్థానాలని టీటీడీ మాజీ ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి తన అడ్డాగా మార్చుకున్నారు. టీటీడీని 'అధర్మో రక్షిత భక్షితః'గా మార్చేశారు. అధర్మాన్ని రక్షించి, ఉన్నదంతా భక్షించడానికి పావులు కదిపారు. ఆధిపత్య ధోరణితో, అహంకార పోకడతో టీటీడీని తన అక్రమాలకు వేదికగా మార్చుకున్నారు. స్వయానా ముఖ్యమంత్రి బాబాయ్ నాలుగేళ్ళపాటు దేవస్థానాల ఛైర్మెన్‌గా ఉన్నా, ఆయన ఆదేశాలను సైతం బేఖాతరు చేసేంత స్థాయిలో తన దర్పాన్ని చాటుకున్నారు. ఆయన అధికారాలకి కూడా అడ్డుకట్ట వేసి ఏదైనా సరే తన కనుసైగలలోనే జరగాలన్న తరహాలో ఈఓ ప్రవర్తించారు.

ముఖ్యమంత్రే తన గుప్పిట్లో ఉన్నారన్న ధీమాతో, తనకి ఎదురులేదన్న ధోరణితో విర్రవీగుతూ టీటీడీలో ఆయన తన హవా కొనసాగించారు. అదనపు ఈఓగా విధులలోచేరి పూర్తిస్థాయి ఇన్‌ఛార్జి ఈఓగా బాధ్యతలు చేపట్టారు. అంతా తానే.. అన్నింటా తానే.. అన్నట్లుగా వ్యవహరించారు. స్వామివారి సన్నిధిలో తానే సర్వాంతర్యామి అన్నట్లుగా అవతరించారు. ఆయన హయాంలో జరిగిన అనేక అవకతవకలపైనా, అవినీతి అక్రమాలపైనా కొత్త ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విజిలెన్సు విచారణకి ప్రభుత్వం ఆదేశించింది.

గత అయిదేళ్ళ కాలంలో నిర్భయంగా, నిర్లజ్జగా, నిస్సిగ్గుగా తమ అధికారాలని సల(స్వా)హాదారులకి తాకట్టుపెట్టిన వారెవరైనా ఇప్పుడు కష్టాలు ఎదుర్కోవలసిందే..! తీగ లాగితే డొంక కదలాల్సిందే...!!

## అమరావతి కోసం..
# అన్నదాతల విరాళం

### రూ. లక్షా 7వేలు అందజేసిన మర్రిపాడు రైతులు



అమరావతి రాజధాని నిర్మాణం కోసం నెల్లూరుజిల్లా మర్రిపాడుకు చెందిన పలువురు రైతులు తమకు వచ్చిన పింఛను మొత్తాలను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరు నగరంలోని ఆయన నివాసంలో రైతులు కలిసి అమరావతి కోసం తమవంతుగా లక్షా 7వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, అమరావతిలో అద్భుతమైన రాజధానిని నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కంకణం కట్టుకుందన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో రెండేళ్లలోనే అమరావతిని నిర్మించేందుకు కృషి జరుగుతుందని చెప్పారు.

## నేత్రపర్వంగా రామతీర్థం బ్రహ్మోత్సవాలు

### హుండీల ద్వారా రూ.4.90 లక్షల రాబడి



విడవలూరు మండలంలోని రామతీర్థంలో కొలువైవున్న కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల 10 రోజులపాటు నేత్రపర్వంగా జరిగాయి. జూన్ 26 నుంచి ప్రారంభమై, ఈనెల 6వ తేదీ ధ్వజావరోహణం, ఏకాంత సేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. తెప్పోత్సవానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ఈ బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు, టీడీపీ నాయకులు ఆవుల వాసు, కటారి సుబ్రహ్మణ్యం, చిన్ని బాబు, శ్రీహరికోట గోపి, వనమాల జనార్ధన్ పాల్గొన్నారు.

## సిద్ధేశ్వరకోనలో.. వైభవంగా 'వారాహిదేవి'కి పూజలు



సైదాపురం మండలంలోని సిద్ధేశ్వరకోనలో కొలువైవున్న శ్రీ దక్షిణామూర్తి స్వామివారి ఆలయంలో ఈనెల 7న ఎంతో మహిమాన్వితమైన వారాహిదేవి అమ్మవారికి పెద్దఎత్తున పూజలు, హోమాలు జరిగాయి. వారాహిదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజున ఎంతో భక్తిశ్రద్ధలతో వారాహిదేవి హోమం, దక్షిణామూర్తి, నాగలింగేశ్వరస్వామి వార్లకు రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పాలడుగు వెంకటసాయి ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకుడు మాచవోలు బాలసుబ్రహ్మణ్యంస్వామి నేతృత్వంలో ఈ పూజలు, హోమాలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## 'ప్రత్యేక హోదా' కోసం..సీఎం గట్టిగా నిలబడాలి



రాష్ట్రానికి గత వైకాపా ప్రభుత్వం 'ప్రత్యేక హోదా'ను తీసుకురాలేకపోయిందని, టీడీపీకి ప్రజలు పెద్దపీట వేసిన నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆ కార్యాన్ని సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 7న ఆయన నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న బీహారు సీఎం నితీష్ ఆ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలని డిమాండ్ చేస్తున్నారని, అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆ విషయంలో గట్టిగా నిలబడాలన్నారు. దేశంలో మతాలను రెచ్చగొట్టడంద్వారా బలపడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. తొలుత ఆయన జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకుడు, దివంగత నేత 'జక్కా వెంకయ్య భవన్'ను ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డెప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు బత్తల కృష్ణయ్య, కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో..'బడికి పోతా' ర్యాలీ

ఇందుకూరుపేట మండలం కొత్తూరులో ఇటీవల బడిఈడు పిల్లలు బడుల్లో చదువుకోవాలని, చదువుతోనే జీవితాలకు రాణింపు ఉంటుందని 'బడికి పోతా' పేరుతో ఆ గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

# 17 నుంచి 21 వరకు..'రొట్టెల పండుగ'

### • బారాషహీద్ దర్గాలో భారీ ఏర్పాట్లు

మత సామరస్యానికి ప్రతీకగా పేరెన్నికగన్న నెల్లూరు దర్గామిట్టలోని పవిత్రమైన బారాషహీద్ దర్గా వద్ద, ప్రపంచస్థాయిలో పేరుగాంచిన 'రొట్టెల పండుగ'కు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత వైభవంగా, భక్తజన కోలాహలంగా జరిగే ఈ పండుగ ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతుందని మతపెద్దలు ఈనెల 7న ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 17న సందల్‌మాలీ, 18న బారాషహీద్‌ల గంధమహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతాయని, 19వ తేది వేకువ నుంచీ రొట్టెల పండుగ ప్రారంభమవుతుందని తెలిపారు. 20న తహలీల్ ఫాతేహా, 21న ముగింపు కార్యక్రమాలుంటాయన్నారు. మతసామరస్యాలకు ప్రతీకగా జరుపుకునే ఈ రొట్టెల పండుగను రాష్ట్రపండుగగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంతో మహిమాన్వితమైన బారాషహీద్ దర్గా సందర్శనకు, రొట్టెల పండుగలో పాల్గొనేందుకు కులమతాలకు అతీతంగా రాష్ట్రం నలుమూలల నుంచే కాక, దేశ విదేశాల నుంచి లక్షలాదిమంది తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసేందుకు దర్గా నిర్వాహకులు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. నాయకులు అబ్దుల్ అజీజ్, గిరిధర్‌రెడ్డి, జనసేన నాయకుడు గునుకుల కిషోర్ తదితరులు దర్గాలో ప్రార్థనలు చేసి, ఏర్పాట్లను పరిశీలించారు.





### భక్తిశ్రద్ధలతో నిషాన్ గంధోత్సవం :

మొహర్రం నెల ప్రారంభంతో పాటు, రొట్టెల పండుగకు ప్రారంభసూచకంగా ఈనెల 7వ తేదీ ఆదివారం రాత్రి బారాషహీద్ దర్గాలో మతపెద్దలు, నంద్యాల పీఠాధిపతి సయ్యద్ హారూన్‌బాషాసాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నగరంలోని కోటమిట్ట అమినియా మసీదు నుంచి గంధాన్ని తీసుకువచ్చి బారాషహీద్ దర్గాలోని పన్నెండుమంది అమరవీరుల సమాధులకు లేపనం చేశారు. ఫకీర్ల గీతాలాపనలు, మేళతాళాల మధ్య జెండాలు చేతపట్టుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. రొట్టెల పండుగ విజయవంతం కావాలని కోరుకుంటూ ప్రార్థనలు చేశారు. టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మతపెద్దలు సయ్యద్ సమీ హుస్సేనీ, ఖాదర్‌బాషా, షంషుద్దీన్, జాకీర్, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...

### పెంచలకోనలో..
### శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈనెల 6న స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తొలుత మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ చేసి, గోపూజ నిర్వహించారు. ఆస్థానమండపంలో వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి పెళ్లివేడుకను నిర్వహించి, సాయంత్రం స్వామిఅమ్మవార్లకు తిరుచ్చి ఉత్సవం చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### వెంగమాంబాపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

బాలాయపల్లి మండలంలోని వెంగమాంబాపురం ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 6న తమ తండ్రి కామినేని వెంకమనాయుడు జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు కామినేని జయరామ్‌ప్రసాద్‌నాయుడు పుస్తకాలను, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొని దాతను అభినందించారు.

### వింజమూరులో సహకార దినోత్సవం

వింజమూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో ఈనెల 6న 102వ అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవాన్ని పురస్కరించుకుని సహకార సంఘాల పతాకాన్ని ఎగురవేశారు. సొసైటీ సీఈఓ ఎం.రమణయ్య సహకార దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. రైతులకు సొసైటీ ద్వారా మేలైన సేవలందిస్తామని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

### రామస్వామిపాలెంలో.. తల్లులకు జాగ్రత్తలు

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో ఈనెల 6న తల్లులు, గర్భవతులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల సమస్యలు వస్తాయని, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోటేశ్వరి సూచించారు. ఏఎన్ఎం రమాదేవి, ఎన్ఎల్‌హెచ్‌పి కృష్ణవేణి పాల్గొన్నారు.

### కోవూరులో షిరిడీసాయికి పూలంగిసేవ

కోవూరు జాతీయరహదారిలో కొలువైవున్న శ్రీ షిరిడీ సాయి మందిరంలో ఇటీవల ఆలయ అర్చకులు జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేక సేవలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి వేడుకగా పూలంగిసేవ, పల్లకిసేవ చేశారు. తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

### మనుబోలులో డయేరియాపై అవగాహన

కలుషితాహారం వల్ల డయేరియా వ్యాధి వస్తుందని, నిల్వవుంచిన ఆహారం తినొద్దని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ చెప్పారు. మనుబోలు కోదండరామపురం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల మహిళలకు డయేరియా వ్యాధిపట్ల అవగాహన కలిగించారు. ఏఎన్ఎం రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

### పొదలకూరులో మధ్యాహ్నభోజనం పరిశీలన

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఎలా ఉంటోందో అధికారులు పరిశీలిస్తున్నారు. పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ స్కూల్‌లో ఇటీవల సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సునంద పాల్గొన్నారు.

### చెర్లోపల్లిలో మంచినీళ్ల పరీక్షలు

మంచినీళ్ల బోర్లనుంచి వస్తున్న నీళ్లు నాణ్యతగా ఉన్నాయా లేదా అని, కోవూరు మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తులసీరామ్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. మంచినీటిని కాచి, చల్లార్చి తాగితే అతిసారవంటి వ్యాధులు రాకుండా నిరోధించవచ్చని గ్రామస్తులకు చెప్పారు.

### సైదాపురం పీహెచ్‌సీ తనిఖీ

సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ)ను ఇటీవల వైద్యాధికారి పీఎల్ దయాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో ఆరోగ్యసేవలు సక్రమంగా అందడం లేదని ఆరోపణలు రావడంతో వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల పట్ల అలక్ష్యాన్ని సహించేది లేదని, సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 'ఆమే'.. కుటుంబానికి ఆ'భరణం'



## సుప్రీం కోర్టు బాసట.. మహిళలకి ఊరట

ముస్లిం మహిళలకు బాసటగా సుప్రీంకోర్టు ఈనెల 10న అద్భుతమైన తీర్పునిచ్చింది. వారు భరణానికి అర్హులేనంటూ విడాకులు తీసుకున్న మహిళలకు పెద్ద ఊరటనిచ్చింది. అంతేకాదు, మతాలకు అతీతంగా, ముస్లిం పర్సనల్ లాను కూడా పక్కనపెట్టి మహిళల త్యాగాలను గుర్తుచేస్తూ.. వారికి ఆర్థిక సాధికారత ఉండాలంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా ఇచ్చిన ఈ చరిత్రాత్మకమైన తీర్పుతో ముస్లిం మహిళలతో పాటు దేశవ్యాప్తంగా మహిళాలోకంలో సంతోషం వ్యక్తమవుతోంది.

'ముస్లిం మహిళలు కూడా భరణానికి అర్హులేనంటూ సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఇచ్చిన తాజా తీర్పు చరిత్రాత్మకం. భర్త నుంచి భరణం కోరే హక్కును భార్యకు ఇచ్చే సీఆర్‌పీసీ సెక్షన్ 125 దేశంలోని మహిళలందరికీ మతాతీతంగా వర్తిస్తుందని పేర్కొంది. 'భరణం దయతో ఇచ్చేది కాదు..అది వివాహిత మహిళలందరికీ ప్రాథమిక హక్కు' అంటూ ముస్లిం పర్సనల్ లాను కూడా పక్కనపెట్టి తీర్పు చెప్పడం సంచలనాత్మకం. తన భార్యకు భరణం చెల్లించాల్సిన వ్యక్తికి సంబంధించిన ఓ కేసు సుప్రీంకోర్టు దాకా రావడంతో, విడాకుల చట్టం–భరణాలకు సంబంధించిన విషయాలన్నిటినీ సుప్రీంకోర్టు ధర్మాసనం కూలంకుషంగా అధ్యయనం చేసి ఇచ్చిన ఈ తీర్పు మహిళల ప్రాథమిక హక్కులకు రక్షణగా మారనుంది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ముస్లిం మహిళల విడాకుల పరిరక్షణ చట్టం 1986, సీఆర్‌పీసీ 125 సెక్షన్‌లలో 125 సెక్షనే ఆ కేసులో వర్తిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. భార్యకు భరణం పొందే చట్టబద్ధమైన హక్కును సెక్షన్ 125 కల్పించిందని, ఇది ముస్లిం మహిళలకు కూడా వర్తిస్తుందని వివరించింది. దేశంలోని వివాహిత మహిళలందరికీ మతాలతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ వర్తిస్తుందని తీర్పు చెప్పింది. వివాహిత మహిళలకు ఆర్థిక భద్రత కలిగించే, లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే హక్కు ఇది.. అని పేర్కొంటూ, ముస్లిం మహిళలు అటు విడాకుల పరిరక్షణ చట్టాన్ని, ఇటు సీఆర్‌పీసీ 125వ సెక్షన్‌ను రెండింటినీ ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఆ మేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆ వ్యక్తి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళకు భర్తనుంచి భరణం కోరే హక్కు ఉందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేయడంతో, ముస్లిం మహిళాలోకానికి పెద్ద స్వాంతన కలిగించినట్లయింది.

### గృహిణుల త్యాగాలను గుర్తించాలిన్న 'సుప్రీం':

ఈ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఎంతో కీలకంగా ఉన్నాయి. పురుషలోకానికి ఆలోచనాత్మకంగా మారాయి. గృహిణుల పాత్రను, కుటుంబం కోసం వారు చేసే త్యాగాలను పురుషులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందంటూ, కుటుంబంలో భార్య పాత్రకు సుప్రీంకోర్టు ఎంతో గౌరవమిచ్చింది. భర్తలు, తమ భార్యలకు ఆర్థికసాధికారత కల్పించాలని, స్వతంత్ర ఆదాయవనరులు లేని భార్యకు.. ప్రత్యేకించి ఆమె వ్యక్తిగత అవసరాల కోసం ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచాలనే వాస్తవాన్ని గుర్తించాలని ధర్మాసనం తన తీర్పులో నొక్కిచెప్పింది. కుటుంబ ఖర్చులకోసం కాకుండా, వ్యక్తిగత ఖర్చులకోసం కూడా జీవితభాగస్వామికి ఆర్థికవనరులను అందుబాటులో ఉంచాలని, ఉమ్మడి బ్యాంకు ఖాతా, లేదా ఏటీఎం కార్డు సౌకర్యాన్ని ఆమెకు కల్పించాలని, ఆమేరకు భర్తలో చైతన్యం ఉండాలని కూడా సూచించింది. భార్యకు ఆర్థిక సాధికారత కల్పించాలనే వాస్తవాన్ని భారతీయ వివాహితుడు తప్పనిసరిగా తెలుసుకోవాలని జస్టిస్ బీవీ నాగరత్న స్పష్టం చేయడం ద్వారా మహిళల ఆర్థిక బాధలను అందరూ గుర్తించేలా చేసింది.

### కుటుంబ వ్యవస్థకు వెన్నెముక మహిళే...

'భారతీయ కుటుంబ వ్యవస్థకు వెన్నెముక మహిళే'నని సుప్రీం ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. భార్యను ఆర్థికంగా సమృద్ధిపరచినప్పుడే కుటుంబంలో భార్య స్థానం ఎవరిమీదా ఆధారపడే పరిస్థితి లేకుండా సుస్థిరంగా ఉంటుందని, ఆ విధమైన చైతన్యంతో తన ఏటీఎం కార్డును ఇవ్వడం ద్వారా, బ్యాంకు ఖాతాను భార్యాభర్తలిద్దరి పేరుమీద తీసుకోవడం ద్వారా, భార్యను ఆర్థికంగా ఆత్మవిశ్వాసంతో ఉంచేలా వ్యవహరిస్తున్న భర్తలను అభినందించాలి' అని కూడా ధర్మాసనం పేర్కొంది. 'భరణం' అనేది దాతృత్వం కాదని..వివాహిత మహిళల ప్రాథమిక హక్కు అనీ, విడాకులు తీసుకున్నవారే కాకుండా వివాహిత మహిళలందరికీ ఆ అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందనీ ధర్మాసనం తేల్చిచెప్పడంతో దేశంలోని మహిళలందరికీ ఈ తీర్పు ఎంతో భరోసాను, వివాహితలకు మరింత ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తోంది.

### మహిళలకు ఆర్థిక సాధికారత ఉండాలి

భారతీయ మహిళలకు ఆర్థిక సాధికారత ఇవ్వాల్సిన అవసరాన్ని గురించి సుప్రీం కోర్టు ఈ తీర్పులో పలు సూచనలు చేయడం విశేషం. మనదేశంలో వివాహం తర్వాత మహిళలు ఇల్లు, పిల్లల పెంపకం, కుటుంబ పోషణ కోసం, వృద్ధుల సంరక్షణ కోసం తమ ఉద్యోగావకాశాలను కూడా వదులుకుని వివాహిత మహిళలు ఎన్నో త్యాగాలు చేస్తుంటారని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. స్వతంత్ర ఆర్థిక వనరులు లేని భార్య మానసికంగానే కాక ఆర్థికంగా కూడా తమపై ఆధారపడుతుందన్న వాస్తవాన్ని కొందరు భర్తలు గ్రహించడం లేదని, ఓ గృహిణిగా మహిళ, ప్రేమ–ఆప్యాయత తప్ప మరే ప్రతిఫలాన్ని ఆశించకుండా కుటుంబం కోసం పనిచేస్తుందని, భర్తనుంచి, ఆయన కుటుంబం నుంచి కాస్త గౌరవాన్ని, భరోసాను మాత్రమే భార్య కోరుకుంటుందని, ఆ మాత్రం కూడా చాలా కుటుంబాల్లో మహిళలకు దక్కడం లేదని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది.

అందుకే భార్యకు ఆర్థిక సాధికారత కల్పించాలని స్పష్టం చేసింది. మహిళల ఆర్థిక భద్రత, ఇంటి భద్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, అప్పుడే స్త్రీలు సాధికారతను సాధించగలరని జస్టిస్ నాగరత్న తన అభిప్రాయాన్ని ఈ తీర్పులో స్పష్టం చేశారు. ఇంటి ఖర్చులకే కాదు,ఆమె వ్యక్తిగత ఖర్చులకు కూడా ఆర్థిక వనరులు అందించాలని, ఆర్థికంగా భర్తమీద ఆధారపడే భార్యకు ఆర్థికపరమైన వత్తిడి లేకుండా చూడడానికే 'భరణం' అని జస్టిస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## తిరుపతిలో ఏబీవీపీ సంస్థాపన దినోత్సవం

- 'విద్యార్థి శక్తే.. జాతీయశక్తి' అన్న ప్రొ. వైవీ రామిరెడ్డి



'విద్యార్థి శక్తే ఒక జాతీయశక్తి' అంటూ అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి విద్యార్థివర్గాల్లో స్ఫూర్తిని కలిగించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ )76వ సంస్థాపన దినోత్సవం ఇటీవల తిరుపతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1949 జులై 9న ఢిల్లీలో కొద్దిమంది సభ్యులతో ప్రారంభమైన ఏబీవీపీ, నేడు కొన్ని లక్షల మంది విద్యార్థుల సభ్యత్వంతో దేశంలోనే కాక ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందన్నారు. నేటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహ కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు సగం మంది మంత్రులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు అనేక రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు, మంత్రులెందరో అఖిలభారత విద్యార్థి పరిషత్‌లో పనిచేసి నాయకులుగా ఎదిగారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత 75సంవత్సరాలుగా భారతదేశంలో రాజకీయరంగంలో అవినీతికి, విద్యాసంస్థల్లో డొనేషన్లకు, ప్రశ్నాపత్రాల లీకేజీలకి వ్యతిరేకంగా పోరాడుతూ, విద్యాసంస్థల్లో నెలకొన్న విద్యార్థినీ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలను ఏబీవీపీ చేపట్టిందని, అంతేకాక దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు ఏబీవీపీ నిరంతరం కృషిచేస్తోందని అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్, జాతీయ కార్యవర్గ సభ్యులు పూజారి రాఘవేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మాలపాటి వెంకటరమణ, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యల్లాల మంజుల, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నరసింహాచారి, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com